గంగమ్మ చెరువుకు దిక్కెవరు..?

బి. తాండ్రపాడు గంగమ్మ చెరువు



కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామాన్ని ఆనుకొని పురాతన గంగమ్మ చెరువు ఉంది. వర్షాకాలంలో నిండుకుండలా కళకళలాడేది. ఈ చెరువు వల్ల భూగర్భ జలాలు పెరిగి.. మూడు నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉండే బోరుబావులు రీచార్జ్ అయ్యేవి. సాగునీటి అవసరం తీరేది. పశువుల దాహం తీర్చే జలపుంతలా గంగమ్మ చెరువు ఆదుకొనేది. ఇదంతా ఒకప్పటి మాట. కర్నూలు నగర విస్తీర్ణం పెరగడంతో చెరువు పరిసరాల్లో రియల్ వెంచర్లు వెలిశాయి. ఎకరం రూ.10 కోట్లకు పైగా పలుకుతోంది. వైసీపీ హయాంలో చెరువుపై అక్రమార్కులు కన్ను పడింది. అప్పటి ప్రభుత్వంలో నెంబరు-2గా చెలామణీ అయిన ఓ మంత్రి అండదండలతో ఏకంగా 12 ఎకరాలకు పైగా చెరువును మట్టితో పూడ్చేశారు. ఆ స్థలం విలువ రూ.120 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఆ భూమి చెరువుకు సంబంధించిందని కాదని, పట్టా భూమి.. అని రెవిన్యూ అధికారులు అక్రమార్కులకే వంత పాడారు. ఇప్పుడు గంగమ్మ చెరువు భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది.

- వైసీపీ హయాంలో 12 ఎకరాలు పూడ్చేసి కబ్జా
- నాడు చక్రం తిప్పిన నంబరు-2గా ఉన్న ఓ మంత్రి
- ఆయన ఒత్తిడితో విచారణ నివేదికలే మార్చేసిన నాటి ఉన్నతాధికారి..?
- నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన మాజీ ఎంపీపీ డి. రాజవర్ధన్
- చెరువు పునరుద్ధరణ చర్యలేమయ్యేను?

కర్నూలు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం బి. తాండ్రపాడు గ్రామాన్ని ఆనుకొని (కర్నూలు నగర శివారు) సర్వే నంబర్లు 76, 77, 78, 79, 80, 81/1, 299, 301, 309, 310 పరిధిలో 53.86 ఎకరాల విస్తీర్ణంలో గంగమ్మ చెరువు ఉంది. జలవనరుల శాఖ రికార్డుల ప్రకారం చెరువు పూర్తి నిల్వ నీటి మట్టం (ఎఫ్‌టీఎల్) 310.180 మీటర్లు కాగా, నీటి నిల్వ సామర్థ్యం 12.309 ఎంసీఎఫ్‌టీ. బి. తాండ్రపాడు గ్రామానికి చెందిన 62 ఎకరాల ఆయకట్టు సాగులో ఉంది. ఈ చెరువు ఆనుకొని వందల ఎకరాల్లో జగన్నాథగట్టు ఉండడంతో వర్షాకాలం ఆ గట్టుపై పడిన వర్షం చెరువులో చేరుతుంది. ఒక్క వర్షం కురిసినా చెరువు నిండుతుంది. ఆయకట్టు పొలాలకు నీరు అందించడమేగాక భూగర్భ జలాలు కూడా ఈ చెరువు వల్ల పెరుగుతాయి. చెరువు దిగువన 3-4 కిలోమీటర్ల వరకు బోరుబావులు రీచార్జ్ అవుతాయని ఇరిగేషన్ ఇంజనీర్లు పేర్కొంటున్నారు. పంచాయతీరాజ్ శాఖ పర్యవేక్షణలో ఉన్న గంగమ్మ చెరువును 2005 ఆగస్టు 23న చిన్ననీటి పారుదల శాఖకు అప్పగించారు. 20 ఏళ్లుగా మైనర్ ఇరిగేషన్ పర్యవేక్షణలో కొనసాగుతోంది. తూములు, కాలువలు కూడా ఉన్నాయి. ఈ చెరువు మరమ్మతు పనులు కూడా చేశారు. చెరువును పూర్తిస్థాయిలో ఆధునికీకరణ కోసం 2015 జూలై 21న రూ.90 లక్షలు నిధులు మంజూరు చేస్తూ అప్పటి ఇరిగేషన్ శాఖ కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ జీవో ఆర్‌టీ నంబరు.479 జారీచేశారు. అయితే.. వివిధ కారణాల వల్ల పనులు మొదలు కాలేదు. ఆయకట్టుతో పాటు బి. తాండ్రపాడు గ్రామంతో పాటు నగరంలోని వివిధ కాలనీల పశువులకు దాహం తీర్చేందుకు ఆధారంగా ఉంది. చెరువు పరిసరాల్లో రియల్ వెంచర్లు వేయడంతో చెరువు ఆయకట్టు కూడా కుచించుకుపోయింది. ఈ చెరువుకు సమీపంలోనే రాయలసీమ యూనివర్సిటీ, జి.పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, ట్రిపుల్ ఐటీ ఎండీ కళాశాలతో పాలిటెక్నిక్ కాలేజీలు, ప్రైవేటు విద్యా సంస్థలు కూడా ఉన్నాయి. భూగర్భ జలాలు పెరిగి ఆయా కాలనీలకు దాహం తీరుస్తుందని ఇంజనీర్లు అంటున్నారు.

మిగతా 6వ పేజీలో

వైసీపీ రావడంతో అక్రమార్కులు కన్నేశారు

2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అక్రమార్కుల కన్ను గంగమ్మ చెరువుపై పడింది. ఎప్పుడో 1932 - 1946 మధ్యలో ఈ చెరువు భూముల్లో క్రయ విక్రయాలు జరిగాయనే రికార్డులు తెరపైకి తీసుకొచ్చారు. తాము కొనుగోలు చేశామని కర్నూలు, హైదరాబాద్‌కు చెందిన కొందరు ఏకంగా చెరువు ఫోర్‌షోర్ ఏరియాను అక్రమించి దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో మట్టి, ఎర్రగరుసుతో 1.20 మీటర్లు నుంచి 1.50 మీటర్ల వరకు పూడ్చేశారు. రియల్ వెంచర్లు వేసేందుకు సిద్ధం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో నెంబరు-2గా చెలామణి అవుతున్న ఉమ్మడి జిల్లాకు చెందిన అప్పటి ఓ మంత్రి, జిల్లాకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు అక్రమార్కులకు అండగా నిలిచారు. ఇంకేముంది అధికారులు సైతం వారికే వంతపాడారు. ఆయకట్టు రైతులు చెరువును కాపాడమని చేసిన ఫిర్యాదులను అధికారులు పట్టించుకోలేదు. పోలీసులు బెదిరించడంతో బి. తాండ్రపాడు గ్రామస్తులు, రైతులు ఏమీ చేయలేకపోయారు. గరుసుతో పూడ్చేసిన చెరువు భూభాగంలోకి ఇతరులు ఎవరు రాకుండా చుట్టూ పిల్లర్లు పాతి, ముళ్లకంచె ఏర్పాటు చేశారు. ఆ సమయంలో జిల్లా పర్యటనకు వచ్చిన నాటి ప్రతిపక్ష నేత, ప్రస్తుతం సీఎం చంద్రబాబు చెరువు అక్రమణను ప్రత్యేక్షంగా చూసి వైసీపీ నేతల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



చెరువును పూడ్చేసి ఇనుప కంచె ఏర్పాటు చేసిన వైనం

పంచాయతీల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి



మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పురోగతిలో వెనుకబడిన గ్రామాలను గుర్తించి అభివృద్ధి సాధించేందుకు గ్రామపంచాయతీ అభివృద్ధి ప్రణాళిక రూపొందించాలని జిల్లా పరిషత్ సీఈవో జి. నాసర రెడ్డి సూచించారు. కర్నూలు నగరంలోని జడ్పీ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో శనివారం ఉమ్మడి జిల్లాలోని ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ ఏర్పాటు చేశారు. శిక్షణలో పంచాయతీ అడ్వాన్స్ ఇండెక్స్, గ్రామస్థాయిలోని సామాజిక, ఆర్థిక ప్రగతిని తెలియజేసే సూచికల గురించి క్లుప్తంగా వివరించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే సంబంధిత జిల్లా స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి గ్రామంలోని వాస్తవ విలువలతో సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో డీపీవో జి.భాస్కర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, డ్వామా పీడీ వెంకటరమణ, పీఆర్, డీఎంహెచ్‌వో, వ్యవసాయం, ఐసీడీఎస్ శాఖల అధికారులు, డీపీఆర్‌సీ కోఆర్డినేటర్ మంజులావాణి, శిక్షణ మేనేజర్ గిడ్డేష్ తదితరులు పాల్గొన్నారు

పంచాయతీ కార్యదర్శులకు నూతన స్థానాలు కేటాయింపు

కర్నూలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ బదిలీల్లో భాగంగా పంచాయతీ కార్యదర్శులకు శనివారం జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్ నూతన స్థానాలను కేటాయించారు. గ్రేడ్-5 ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు 27 మంది, రిక్వెస్ట్‌పై 9 మంది, అంతర్ జిల్లా బదిలీపై ఒక్కరూ బదిలీ అయ్యారు. గ్రేడ్-6లో ఐదు సంవత్సరాలు పూర్తయిన వారు 196 మంది, రిక్వెస్టుపై 11 మంది అంతర్ జిల్లా బదిలీపై 25 మంది బదిలీ అయ్యారు. అదే విధంగా భూసర్వే డిపార్టుమెంటులో ఐదు సంవత్సరాలు పూర్తి చేసిన వారు 298 మంది, క్రమబద్ధీకరణలో భాగంగా 258 మంది అంతర్ జిల్లా బదిలీలపై 28 మంది రిక్వెస్టుపై 58 మంది దరఖాస్తు చేసుకోవడం జరిగింది. వీరందరికి నూతన స్థానాలు కేటాయించారు. రెండు రోజుల్లో నూతన స్థానాల్లోని విధుల్లో చేరనున్నారు.

సంగమేశ్వరంలో పుష్కర ఘాట్లను ముంచెత్తిన వరద జలాలు

- శ్రీశైలానికి కొనసాగుతున్న 1.88 లక్షల క్యూసెక్కుల వరద



సంగమేశ్వరంలో పుష్కర ఘాట్లను ముంచెత్తిన వరద జలాలు

కొత్తపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు సప్తనదుల సంగమేశ్వరంలోని ఎగువ పుష్కరఘాట్లను వరద జలాలు ముంచెత్తుతున్నాయి. శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాజెక్టుల నుంచి 1.88లక్షల క్యూసెక్కులు వరద జలాలు వచ్చి చేరుతున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885అడుగులు కాగా, శనివారం సాయంత్రం 6 గంటల సమయానికి 877.40 అడుగులుగా నమోదైంది. అలాగే రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటినిల్వలు 215టీఎంసీలు కాగా 175 టీఎంసీలుగా నమోదైంది. ఇదిలా ఉంటే గత వారంలోనే సంగమేశ్వరాలయం పూర్తిగా కృష్ణమ్మ నది గర్భంలో నిక్షిప్తమైన విషయం విదితమే ఈ నేపథ్యంలో ఎగువ పుష్కర ఘాట్లపైన ఉన్న ఉమామహేశ్వరస్వామి ఆలయంలో భక్తులు శివుడ్ని దర్శించుకుని భక్తులు పూజలు చేస్తున్నారు. శ్రీశైలం రిజర్వాయర్ వరద జలాలు అధికంగా చేరుతుండటంతో సముద్ర తీరం తలపిస్తుంది. దీంతో పర్యాటకులు తిలకించేందుకు అధికంగా తరలివస్తున్నారు.

సత్వర న్యాయానికి లోక్ అదాలత్

జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది



ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కక్షిదారులకు సత్వర న్యాయం అందించాలనే ధ్యేయంతోనే లోక్ అదాలత్‌లను నిర్వహిస్తున్నామని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి. కబర్ది పేర్కొన్నారు. శనివారం స్థానిక లోక్ అదాలత్ భవనంలో జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులకు కొన్నేళ్లుగా పరిష్కారం కాని భూసేకరణ కేసులలో నష్టపరిహారం చెల్లించడానికి ఈ రోజు నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. భూములు కోల్పోయిన వారు నష్టపరిహారం సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నాదరని, వారికి చెక్కులు అందజేస్తున్నామని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. లీలా వెంకటశేషాద్రి మాట్లాడుతూ ఈ జాతీయ లోక్ అదాలత్‌లో 16 బెంచ్‌లను వివిధ న్యాయాధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయాధికారులు కమలాదేవి, వాసు, శ్రీవిద్య, అదనపు సబ్ జడ్జీ దివాకర్, జూనియర్ సివిల్ జడ్జి సరోజనమ్మ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు పెద్ద సంఖ్యలో కక్షిదారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం

ఉమ్మడి జిల్లాలోని వివిధ కోర్టులలో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌లో 12,558 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి తెలిపారు. కర్నూలులో 4,735 కేసులు, ఆదోనిలో 860, ఆళ్లగడ్డలో 838, నంద్యాలలో 1,566 కేసులు, ఆలూరులో 400 కేసులు, ఆత్మకూరులో 583, బనగానపల్లెలో 438, డోన్‌లో 748, కోవెలకుంట్లలో 309, నందికొట్కూరులో 553, పత్తికొండలో 774, ఎమ్మిగనూరులో 754 కేసులు పరిష్కారమైనట్లు ఆయన తెలిపారు.

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ రంజిత్ బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. అధికారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నెంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చన్నారు. అలాగే అర్జీదారులు Meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో వారి అర్జీలు నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

ఇక నుంచి కర్నూలులోనే వైద్యుల రిజిస్ట్రేషన్

- యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి టీజీ భరత్



కర్నూలు మెడికల్ కళాశాలలో వైద్యుల రిజిస్ట్రేషన్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వైద్యుల రిజిస్ట్రేషన్, రెన్యువల్, ఇతర సేవలు కర్నూలులోనే అందనున్నాయి. శనివారం వైద్యుల రిజిస్ట్రేషన్ యూనిట్‌ను కర్నూలు మెడికల్ కాలేజీలో పరిశ్రమలు, వాణిజ్యం ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం నారా చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ ఎల్లప్పుడూ ప్రజలకు మంచి చేయాలన్న ఉద్దేశంతో 500 సర్వీసులతో వాట్సాప్ గవర్నెన్స్‌ను అభివృద్ధి చేశారన్నారు. మన రాష్ట్రంలో ఉన్న వైద్యులు వారి సర్టిఫికెట్లు రిజిస్ట్రేషన్లు, రీ-రిజిస్ట్రేషన్లు, ఇతర సేవలు ఎక్కడికక్కడ జిల్లాలో చేయించుకునే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గతంలో డాక్టర్లు రిజిస్ట్రేషన్ల కోసం విజయవాడకు వెళ్లాల్సి వచ్చేదని, ఏవైనా సర్టిఫికెట్లు తక్కువైతే వెనక్కి రావడం చాలా శ్రమ, ఖర్చుతో కూడుకున్న వ్యవహారమని, 60ఏళ్లు పైబడిన డాక్టర్లకు ఇంకా కష్టంగా ఉంటుందని అన్నారు. ఈ కష్టాల నుంచి డాక్టర్లను విముక్తి చేసేందుకు కర్నూలులోనే రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించామన్నారు. ఆదోని ఎమ్మెల్యే డా.పార్థసారథి మాట్లాడుతూ చాలా మంది వైద్యులు రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించుకోకుండా ప్రాక్టీసులో ఉంటారని, దీనివల్ల వారి వైద్య వృత్తికి ఇబ్బందులు కలుగుతాయని అన్నారు. ఇప్పుడు విజయవాడకు వెళ్లకుండా కర్నూలులోనే రెన్యువల్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం ఉందని చెప్పారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ దగ్గుబాటి శ్రీహరిరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలోనే రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయించే సేవలను తీసుకుని వచ్చామని ప్రతి శని, ఆదివారాల్లో ఈ కార్యక్రమాలు చేపడుతామన్నారు. గతంలో 40వేల నుంచి 50వేల వరకు ఉండే రీ రిజిస్ట్రేషన్‌ను ఇప్పుడు 75ఏళ్లు పైన ఉన్న వారికి రూ.6వేలు, 75 ఏళ్లలోపు ఉన్న వారికి రూ.8వేలు రిజిస్ట్రేషన్ చేయనున్నట్లు తెలిపారు. ఐదేళ్ల కంటే మూడు నెలల ముందుగా రెన్యువల్ చేసుకోవచ్చన్నారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. చిట్టినరసమ్మ, జీజీహెచ్ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి. శ్రీరాములు పాల్గొన్నారు.

10న 'మెగా పీటీఎం 2.0'

- ప్రజా ప్రతినిధులను, పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలి
- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లాలో అని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కాలేజీలలో మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పేరెంట్- టీచర్ మీటింగ్ ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలల మధ్య బంధాన్ని బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10న జరిగే మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాల ఏర్పాట్లలో ఎలాంటి లోపాలు ఉండకూడదని అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థులతో స్వయంగా ఆహ్వాన పత్రికలను తయారు చేయించి కార్యక్రమానికి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇతర ప్రజాప్రతినిధులను పూర్వ విద్యార్థులను ఆహ్వానించాలన్నారు. సంబంధిత పాఠశాల, కళాశాలల్లో ప్రతిభ సాధించిన వారు ఎవరైనా ఉంటే వారు షైనింగ్, స్టార్ అవార్డులు తీసుకున్న వారందరినీ ప్రత్యేకంగా ఆహ్వానించాలన్నారు. అలాగే పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులు తప్పకుండా సమావేశానికి హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు విద్యార్థికి సంబంధించిన సమగ్ర పురోగతి కార్డులను అందించాలన్నారు. సమావేశంలో పాఠశాల విద్యాపరమైన పనితీరు, కార్యాచరణ ప్రణాళికల గురించి చర్చించాలన్నారు. పాఠశాల అభివృద్ధికి సంబంధించి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు కూడా తీసుకోవాలన్నారు. అదే విధంగా శుభ్‌దిన్ భోజనం పేరుతో మధ్యాహ్న భోజనం అందించాలన్నారు.

మహిమాన్వితం దొర్నీ క్షేత్రం
- ఎత్తయిన కొండల్లో ఆధ్యాత్మిక క్షేత్రం
- ప్రతి రోజూ ఉత్తర ద్వార దర్శనమే

6

రిమాండ్ ఖైదీ మృతి 7

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

మహిమాన్వితం దౌర్వి క్షేత్రం



నల్లమల సమీపంలో పచ్చదనం మధ్య దౌర్వి క్షేత్రం

● ఎత్తయిన కొండల్లో ఆధ్యాత్మిక క్షేత్రం ● ప్రతి రోజూ ఉత్తర ద్వార దర్శనమే

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎత్తయిన కొండలు, పచ్చని వృక్షాల మధ్య గలగల పారే ప్రకృతి నీటి సవ్వడుల మధ్య విరాజిల్లుతోంది దౌర్వి లక్ష్మీ నరసింహస్వామి క్షేత్రం. రుద్రవరం మండలంలో ఉన్న ఈ క్షేత్రం అహోబిలానికి 16 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ క్షేత్రానికి ఆసక్తికర కథనం ఇక్కడి ప్రాంతంలో ప్రాచుర్యంలో ఉంది. దౌర్వి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు పరిపాలనలో భాగంగా 1398లో (627 ఏళ్ల) క్రితం నిర్మాణం చేపట్టారు. కాకతీయ ప్రతాపరుద్ర మహారాజు పరమశివుడి భక్తుడు. ప్రతిరోజూ స్వర్ణ శివలింగాన్ని కంసలివారిచేత పోత పోయించి ఆ శివలింగానికి పూజలు చేసి బ్రాహ్మణులకు దానం చేసేవాడు. శ్రీశైలం నుంచి తిరుగు ప్రయాణంలో రుద్రవరం సమీపంలో సామంతులు, సేనాధిపతులు, పురోహితుల సమేతంగా బస చేశారు. యథావిధిగా కంసాలి స్వర్ణ శివలింగాన్ని ఎన్నిసార్లు పోత పోసినా నృసింహస్వామి రూపం వచ్చింది. ఈ విషయాన్ని రాజుకు చెప్పాడు. స్వయంగాప్రతాపరుద్ర మహారాజు ముందే శివలింగాన్ని కంసాలి పోత పోశాడు. శివలింగం రాకుండా నరసింహస్వామి రూపం రావడంతో రాజు ఆశ్చర్యపోయాడు. రాజు స్నానం ఆచరించి ఉపవాసంతో ధ్యానంలో నిమగ్నమయ్యాడు. అహోబిళ నరసింహస్వామి సాక్షాత్తు స్వప్నంలో రాజుకు కనిపించి ఇదంతా నృసింహస్వామి క్షేత్రమని, తన మహిమ వల్లే ఇలా జరిగిందని భావిస్తాడు. ఇదిలా ఉండగా దౌర్వి అంటే ఓబులానికి ద్వారం. రుద్రవరం సమీపంలో నిర్మించిన దౌర్విక్షేత్రంలో శివలింగాన్ని ప్రతిష్ఠించాలని కాకతీయ రుద్రమహారాజు ఆలయాన్ని నిర్మించాడు. ఈ ప్రాంతంలో పోత పోస్తే నరసింహస్వామి ప్రతిమ కనిపించడంతో చెంచులక్ష్మి సమేత లక్ష్మీనరసింహస్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అహోబిళానికి ద్వారమే దౌర్వి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం అని ఇక్కడి పురాణాల ద్వారా తెలుస్తోంది.



చెంచులక్ష్మి అమ్మవారు సమేత లక్ష్మీనరసింహస్వామి

దౌర్వి క్షేత్రంలో 365 రోజులు ఉత్తర ద్వారం పూజలు కొనసాగుతాయి. వైష్ణవ క్షేత్రాల్లో ముక్కోటి ఏకాదశి రోజున ఉత్తర ద్వారా వెళ్లి పూజలు చేస్తుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఏడాది పొడవునా ఉత్తర ద్వార దర్శనమే ఉంటుంది. ఆలయంలో స్వామివారు విల్లంబు చేతబట్టి భక్తులకు దర్శనమిస్తారు. ఈ దౌర్విక్షేత్రంలో ఉన్న నీటి గుండాల ప్రకృతి ధార నీటి సరఫరా అవుతుంది. దేవాలయం ప్రాంతంలో ఈ నీరు ఈ వంద ఎకరాలకు సరఫరా అవుతుంది. 627ఏళ్ల క్రితం నిర్మించిన దౌర్విలక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని 2021లో పునఃనిర్మాణ పనులు చేపట్టారు. ఆలయం చుట్టూ సూర్యచంద్రులతో పాటు దశావతారాలు, నవనారసింహ క్షేత్రాల ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి.



చంద్రుడు గౌతమబుద్ధుడితో పాటు నవనరసింహ ప్రతిమలు

ఆ ఆరుగురి సహకారంతో



దౌర్వి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రం పునఃనిర్మాణ పనులు వేగవంతంగా సాగాయి. కానాలా వెంకటనరసింహులు, నరసింహ, వరద దస్తగిరి, అన్నదాత ఓబులయ్య, చాకలి నరసింహ, పోలుదాసు లక్ష్మీనరసయ్యలు ఆలయ అభివృద్ధిలో కృషి చేశారు. ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నాం.

- శ్రీనివాసులు
దేవాలయ నిర్వాహకుడు, రుద్రవరం



627 ఏళ్ల క్రితం ప్రతాపరుద్ర మహారాజు నిర్మించిన దేవాలయం (ఫైల్)

హరిత బనగానపల్లె లక్ష్యం: మంత్రి బీసీ

బనగానపల్లె, జూలై 5(ఆంధ్రజ్యోతి): హరిత బనగానపల్లెగా మార్చడమే తన లక్ష్యమని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. మంత్రి బీసీ జన్మదినం పురస్కరించుకొని బీసీ ఇందిరమ్మ సొంత నిధులు రూ.30 లక్షలతో 5వేల మొక్కలు, కుండీలు కొనుగోలు చేసి హరిత బనగానపల్లె సంకల్పానికి శనివారం శ్రీకారం చుట్టారు. ముందుగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తర్వాత బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డితో పాటు కలెక్టర్ రాజకుమారి, డివైడర్లపై విద్యార్థులతో కలసి మంత్రి బీసీ దంపతులు మొక్కలు నాటారు. అనంతరం బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ మొక్కలు నాటే కార్యక్రమానికి అందరూ సహకరించాలని, మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రజలదేనని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత బనగానపల్లె కార్యక్రమానికి బీసీ ఇందిరమ్మ శ్రీకారం చుట్టడం అభినందనీయమని అన్నారు.



మొక్కకు నీరు పోస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి

సహకారంతోనే అభివృద్ధి

డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, జూలై 5: పరస్పర సహకారంతోనే వ్యక్తులైనా సంస్థలైనా అభివృద్ధి చెందడం జరుగుతుందని జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ డి.విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. శనివారం నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రాంగణంలో అంతర్జాతీయ సహకార జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు లక్ష్మి మహిళలు సాధించిన ప్రగతిని చూస్తే ఎంతో గర్వపడాల్సి వస్తుందని, అదే విధంగా కలిసిమెలిసి ఉంటే అభివృద్ధి జరగడమే కాకుండా ఎటువంటి ద్వేషాలు, ఘర్షణలు జరగకుండా ప్రశాంతమైన జీవనాన్ని సాగించవచ్చన్నారు. కార్యక్రమంలో డీసీవో వెంకటకృష్ణ, నాబార్డు అధికారి సుబ్బారెడ్డి, బ్యాంకు డీజీఎంలు సునీల్ కుమార్, ఉమామహేశ్వరరెడ్డి, నాగిరెడ్డి, ఏజీఎంలు త్రినాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



జెండాను ఎగురవేస్తున్న విష్ణువర్ధన్ రెడ్డి

అమర సంజీవని నేరేడు




చాగలమర్రి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇది మామిడి పండ్ల సీజన్ అని చాలా మందికి తెలుసు. అట్లాగే ఇది నేరేడు పండ్ల కాలం కూడా. మార్కెట్‌లో నేరేడు పండ్లు విరివిగా కనిపిస్తున్నాయి. నేరేడులో పోషకాలు పుష్కలం. వాటికి ఔషధ గుణాలు కూడా ఉన్నాయి.

ఆయుర్వేదంలో నేరేడును అమర సంజీవనిగా పేర్కొంటారు. ఏ, సీ మిటమిన్లు, ఆగ్రాలిక్ ఆమ్లం ఆరోగ్యానికి అత్యవసరం నేరేడు శరీరంలోని విష పదార్థాలను హరిస్తుంది. అందువల్లే సంప్రదాయ వైద్యంలో ఈ పండ్లను విస్తృతంగా వాడేవారు. ఇవి కడుపులోని నులిపురుగులను చంపేస్తాయి. నోటి క్యాన్సర్‌కు మంచి మందులా పనిచేస్తాయి. షుగర్ వ్యాధిగ్రస్థులు నేరేడును తప్పనిసరిగా తినాలి. నేరేడు పండ్ల గింజలను కాల్చి కాల్చి పొడి చేసి నీటిలో కలిపి తాగితే చక్కెరశాతం అదుపులో ఉంటుంది. మూత్రాశయ సమస్యలకు ఇది మంచి టానిక్‌లా పని చేస్తుంది. అతిసారను కూడా నివారిస్తుంది. పండుతో పాటు ఆకులకు కూడా ఔషధగుణాలు ఉన్నాయి. నేరేడు ఆకులతో కట్టుకడితే గాయాలు తగ్గుతాయి. నోటిపూత, చిగుళ్ల వ్యాధులు, దంతక్షయం వంటి సమస్యలు నేరేడు ఆకుల రసాన్ని పుక్కిలిస్తే తగ్గుతాయి. మదనపల్లి, రాజమండ్రి, బెంగుళూరు ప్రాంతాల నుంచి హైబ్రిడ్ నేరేడు పండ్లు దిగుమతి అవుతున్నాయి. హైబ్రిడ్ కంటే నాటుపండ్లే శ్రేష్ఠం. నల్లమల నుంచి గిరిజన మహిళలు తీసుకొచ్చి విక్రయించే నేరేడు పండ్లకు మంచి డిమాండ్ ఉంది.



ఆటోలో విక్రయిస్తున్న నేరేడు పండ్లు

రోగ నివారణకు ఔషధ సమానం




కుప్పగా పోసిన నేరేడు పండ్లు

తుంగభద్ర తీరం

సాహిత్యం

ఎల్లకాలాలకు 'విప్లవ జ్యోతి'

అల్లూరిపై సురేష్‌బాబు పద్యకావ్యం



కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వీరులకు మరణం ఉండదు. వాళ్ల భౌతికంగానే దూరమవుతారు. ప్రజల హృదయాల్లో నిత్యం జీవిస్తుంటారు. అలాంటి వారిలో అగ్రగణ్యుడు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. బ్రిటీషు దొరలను గడగడలాడించిన విప్లవ జ్యోతి అల్లూరి స్మృతిలో అనేక పుస్తకాలు వెలువడ్డాయి. పద్య కావ్య రూపంలో జిల్లాకు చెందిన ప్రముఖ కవి డాక్టర్ తొగట సురేష్‌బాబు 'విప్లవ జ్యోతి' పుస్తకం విడుదల చేశారు. అల్లూరి సీతారామరాజు చలన చిత్రాన్ని తీసిన దివంగత సినీ నటుడు కృష్ణ ఒక చరిత్ర సృష్టించిన నేపథ్యంలో ఆయనకే ఈ పద్య కావ్యం అంకితం చేయడం విశేషం. విప్లవ జ్యోతి పద్య కావ్యమైనప్పటికీ డాక్టర్ సురేష్‌బాబు అందరూ చదువుకునే సులభశైలితో అక్షరీకరించారు. కవి తొగట సురేష్‌బాబు డిగ్రీ చదువుతున్నప్పుడే 1992లో కావ్య రచన మొదలు పెట్టారు. అలా రాసుకుంటూ 2024 మే నెలలో దీన్ని పూర్తి చేశారు. ఈ పద్యక్యావం తొమ్మిది అశ్వాసాల్లో, వివిధ ఘట్టాలను ఎంతో అందంగా కూర్చారు రచయిత. సీతారామరాజు కుటుంబ నేపథ్యం, ఆయన జననం, బాల్యం, రాజమండ్రిలో తండ్రిగారి వియోగం, అనంతరం నరసాపురం, కాకినాడ, రాజమండ్రి, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లో బాబాయ్ వెంట వెళ్లి చదువుకోవడం, విశాఖలో చదువుకునే రోజుల్లోనే సీతతో పరిచయం, సీతా వియోగం, సీతారామరాజుగా పేరు మార్చుకోవడం, చదువుతోపాటు జ్యోతిష్యం, హస్తసాముద్రికం, గుర్రపుస్వారీ, వ్యాయామం, ఈత, నాటకాలు ఇలా అనేక అంశాల్లో రామరాజు పాత్ర చక్కగా తెలియజేశారు. అలాగే మన్యప్రాంత పరిచయం, దారకొండ సమీపంలో సీతారామరాజు యోగిగా ఆవిర్భవించడం, దినచర్య, మన్యం ప్రజలకు దగ్గర కావడం, మన్యంలో బ్రిటీషు వారి దురాగతాలను నిలదీయడం, తహసీల్దారు బాస్టియన్ దురాగతాలు, ప్రభుత్వానికి ఫిర్యాదు, అల్లూరి అన్నీ వదిలేసి ఉద్యమంలో పూర్తిస్థాయిలో పాల్గొనడం వంటి అంశాలన్నీ ఈ పుస్తకం చదివితే సీతారామరాజు చరిత్ర కళ్లకు కట్టినట్లు తెలుస్తుంది. అల్లూరి సహచరులుగా పనిచేసిన ఇతర వీర విప్లవ మరణాలను కూడా రచయిత పాఠకులకు సవివరంగా తెలియజేశారు. రామరాజు సీతల పరిచయంలో సీత ఇలా అంటుంది 'శాశ్వతమ్ములు కావు జగతి జీవమ్ములు/శాశ్వతములు కావు సంపదలును/శాశ్వతమది యొకటె సత్కీర్తి గణియించ/పొందవలయు దాని పూని జనులు' అని. సీతారామరాజులో స్వాతంత్ర్య స్ఫూర్తిని రేకెత్తించిన స్త్రీ మూర్తి ఆమె. అలాగే మన్యం వీరుడు రామరాజు తెల్లవాళ్ల తుపాకీ గుండ్లకు బలైనప్పుడు 'ఒరిగె రామరాజు శిరమొక ప్రక్కగా/గుండెజొచ్చి చీల్చ గుండు వడిని/ఆంధ్రవిప్లవ రవి అస్తమించెనటంచు/కుమిలిపోయె ప్రకృతి గుండెలవియ' అని కన్నీరు పెట్టిస్తారు రచయిత. స్వాతంత్ర్య సంగ్రామంలో గాంధీజీది అహింసా పద్ధతి అయితే, సీతారామరాజుది విప్లవోద్యమ పద్ధతి. తొమ్మిది అశ్వాలుగా రాసిన అల్లూరి జీవిత చరిత్రలో ప్రతి అశ్వమూ ఆసక్తికరంగా చదివిస్తుంది. ఈ పుస్తకం అన్ని ప్రముఖ పుస్తక విక్రయశాలల్లో లభిస్తుంది.

● జంధ్యాల రఘుబాబు, కర్నూలు



గంగమ్మ చెరువుకు దిక్కెవరు?

(5వ పేజీ తరువాయి)

ఫలించిన రాజవర్ధన్‌రెడ్డి పోరాటం



రాజవర్ధన్ రెడ్డి(ఫైల్)

ఆక్రమణల నుంచి బి. తాండ్రపాడు చెరువును, పర్యావరణాన్ని సంరక్షించాలని కోరుతూ టీడీపీ యువ నాయకుడు, కర్నూలు మాజీ ఎంపీపీ డి. రాజవర్ధన్ రెడ్డి 2021లో చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యూనల్ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్) ఆశ్రమించారు. ఆయన ఫిర్యాదును పరిగణలోకి తీసుకున్న నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్ అప్లికేషన్ నంబరు-193/2021(ఎస్‌జడ్) విచారణ చేపట్టింది. విచారణ సాగుతుండగానే రాజవర్ధన్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన తండ్రి, టీడీపీ సీనియర్ నాయకుడు, కేడీసీసీబీ చైర్మన్ డి. విష్ణువర్ధన్‌రెడ్డి కేసును కొనసాగించాడు. కర్నూలుకు చెందిన న్యాయవాదులు బి. మోహన్‌కృష్ణ, సాయిసత్య బలమైన వాదనలు వినిపించారు. అదే సమయంల్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కర్నూలు ఆర్డీవో, తహసీల్దారు, కర్నూలు మైనర్ ఇరిగేషన్ డివిజన్ ఈఈ, సబ్ డివిజన్ డీఈఈ, ఏఈ కమిటీ గ్రామస్థులతో కలసి క్షేత్రస్థాయిలో విచారించింది. రెవెన్యూ రికార్డులు కూడా పరిశీలించింది. పూర్తి వివరాలతో విచారణ నివేదికను గ్రీన్ ట్రిబ్యునల్‌కు పంపించారు. అయితే.. ఈ నివేదిక తయారీలో వైసీపీ హయాంలోని కీలక మంత్రి ఒకరు ఒత్తిడి వల్ల అప్పటి జిల్లాకు చెందిన ఓ కీలకమైన ఉన్నతాధికారి నివేదికను పలుమార్లు మార్చి తయారు చేయించారనే ఆరోపణలు అప్పట్లో వెల్లువెత్తాయి. చెరువు పట్టా భూమినా, క్రయ విక్రయాలు జరిగాయా..? అన్న రెవెన్యూ రికార్డులు పక్కన పెడితే.. గంగమ్మ చెరువు విస్తీర్ణం 53.86 ఎకరాలు వర్గీకరణలో ప్రభుత్వ డ్రై భూమిగా చూపుతూ.. రిమార్క్ కాలంలో ఆర్ఎస్ఆర్-28 ప్రకారం ఇతరుల పేర్లు ఉన్నాయని నివేదికలో చూపారు. అలాగే.. చెరువు కింద 62 ఎకరాలు ఆయకట్టు ఉంటే.. నగరం పెరగడంతో 25-30 ఎకరాలకు తగ్గిందని చూపారు. బోరుబావుల రీచార్జ్, పశువులకు తాగునీరు ఆధారమని వివరించారు. చెరువు వల్ల 3-4 కి.మీల వరకు భూగర్భ జలాలు పెరుగుతున్నా యని, పరిసరాల్లో పలు ఉన్న విద్యా సంస్థలు ఉన్నాయని వివరించారు. సుదీర్ఘ విచారణ అనంతరం గంగమ్మ చెరువు ఆక్రమంగా పూడ్చివేతలను తొలగించడంతో పాటు చెరువును పునరుద్ధరించాలని గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చింది.



ప్రభుత్వ ఆదేశాల మేరకు ముందుకు వెళ్తాం

బి. తాండ్రపాడు గంగమ్మ చెరువులో ఆక్రమణలను తొలగించి చెరువును పునరుద్ధరించమని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చినట్లు మా దృష్టికి వచ్చింది. ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు గంగమ్మ చెరువును పునరుద్ధరణ చర్యలు తీసుకుంటాం.

● బాలచంద్రారెడ్డి, ఎస్ఈ, జలవనరుల శాఖ, కర్నూలు

శ్రీమఠం వైద్యశాలకు విరాళంగా అంబులెన్స్

మంత్రాలయం, జూలై 5(ఆంధ్రజ్యోతి): బెంగళూరుకు చెందిన ఏజే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు రవీంద్ర నాయక్, కృష్ణ పురోహిత్ అనే భక్తులు మంత్రాలయం శ్రీమఠం సుజయీంద్ర ఆరోగ్య వైద్య శాలకు రూ.10 లక్షలు విలువ చేసే అత్యాధునిక వసతులు ఉన్న అంబులెన్స్ వాహనాన్ని విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జ్యోషి, శ్రీపతిఆచార్, సురేష్ కోణాపూర్ తెలిపారు. శనివారం దాతలు కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని అంబులెన్స్‌కు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులుచే పూజలు చేసి ఆస్పత్రి సిబ్బందికి అప్పగించారు. దాతల కుటుంబాలకు పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు శ్రీరాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.



అంబులెన్స్‌తో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు, దాతలు

ప్రణాళికాబద్ధంగా రాష్ట్రాభివృద్ధి

● పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజాన్ని నిర్మించడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పని చేస్తుందని, సీఎం చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రాభివృద్ధికి పక్కా ప్రణాళికలతో ముందుకెళ్తున్నామని పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగర పాలక కార్యాలయంలో కర్నూలు నియోజకవర్గానికి సంబంధించి స్వర్ణాంధ్ర-పీ4(పబ్లిక్,ప్రైవేటు, పీపుల్స్, పార్టనర్‌షిప్) తొలి జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. బంగారు కుటుంబాల ఎంపిక అర్హతలు పక్కాగా పరిశీలించి లబ్ధిదారులను ఎంపిక చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 2029 నాటికి నియోజకవర్గంలో అర్హులందరికీ వందశాతం ఇళ్లు తప్పనిసరిగ్గా ఉండాలని, అందుకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న ఐదేళ్లలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. మున్సిపల్ పాఠశాల స్థితిగతులను పరిశీలించి, అవసరమైన ఆధునికీకరణ పనులను చేపట్టేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పార్కుల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని, పాతబస్తీలో విచ్చలవిడిగా ఉన్న కరెంటు తీగల సమస్యను పరిష్కరించాలన్నారు. ప్రధాన రోడ్ల వెంట గోడలను శుభ్రపరిచి పెయింటింగ్ వేయాలని, మొక్కలు నాటడం మరింత వేగవంతం చేయాలని సూచించారు. పార్కింగ్, వెండింగ్ జోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు రహదారులపై ఆక్రమణలు తొలగించాలని, టిడ్కో గృహాల అభివృద్ధికి శ్రద్ధ చూపాలని సూచించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, తహసీల్దారు రవికుమార్, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వరరెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ లీలా ప్రసాద్, హార్టికల్చర్ ఏడీ విజయలక్ష్మి, సీఎంఎం భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

వజ్రానికి బేరం కుదిరింది

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల క్రితం పొలం పని చేస్తున్న వ్యవసాయ కూలికి దొరికిన వజ్రానికి బేరం కుదిరింది. శనివారం మండలంలోని పెండేకల్‌కు చెందిన ఓ వ్యవసాయ కూలికి దొరికిన వజ్రాన్ని గుత్తికి చెందిన వజ్రాల వ్యాపారులు రూ.7 లక్షలకు కొనుగోలు చేసినట్లు సమాచారం.

కాంగ్రెస్ బలోపేతమే లక్ష్యం



కర్నూలు అర్బన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా పని చేస్తానని కర్నూలు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ, ఏఐసీసీ సభ్యుడు జంగిటి లక్ష్మీ నరసింహ యాదవ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలుపుకుంటానని తెలిపారు.. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి అంబటి రామకృష్ణ యాదవ్ స్థానంలో అవకాశం కల్పించిన పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలాకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థినిపై ఆటో డ్రైవర్ అఘాయిత్యం

ఆదోని రూరల్, జూలై 6 (ఆంధ్రజ్యోతి): అమ్మా నాకు అనారోగ్యంగా ఉంది..ఆసుపత్రికి తీసుకెళ్లమ్మా.. అంటూ పత్తికొండ మండలంలో ఓ ప్రభుత్వ హాస్టల్‌లో చదువుతున్న సి.బెళగల్ మండలానికి చెందిన బాలిక తన తల్లికి కబురు పంపింది. దీంతో ఆ తల్లి ఆ హాస్టల్ కెళ్లి తన బిడ్డను తీసుకొని ఎమ్మిగనూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించింది. ఆ తర్వాత ఇద్దరూ బస్టాండుకు చేరుకున్నారు. ఇంతలో పక్కనే ఉన్న బిడ్డ కనిపించకుండాపోయింది. కానీ బాలిక తన తల్లి ఆదోనికెళ్లే బస్సు ఎక్కిందని తాను కూడా ఎక్కి కూర్చోంది. బస్సులో తల్లి కనపడకపోవడంతో తనతో ఉన్న డబ్బుతో టిక్కెట్ తీసుకొంది. ఆరు గంటల సమయంలో ఆదోని - ఆస్పరి బైపాస్‌లో బస్సు దిగి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న బాలికకు బస్టాండు వైపు వెళ్తున్న మండలంలో ఇస్వీకి చెందిన నిందితుడు ఆటో కనిపించింది. ఆ ఆటో ఎక్కి బస్టాండులో దిగింది. బాలిక ఒంటరిగా ఉందని గుర్తించిన ఆటో డ్రైవర్ రమేష్ పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి ఆటోలో ఆదోని - ఎమ్మిగనూరు బైపాస్‌లోని ఆడవిలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. ఆ తర్వాత బాలికను హాస్టల్‌లో వదిలిపెట్టడానికి ప్రయత్నిస్తూ పోలీసు స్టేషన్‌కు తీసికెళ్లాడు. ఈ క్రమంలో ఆదోని త్రీటౌన్ సీఐ రామలింగయ్యకు అనుమానం వచ్చి బాలికను విచారించారు. బాలిక తనపై జరిగిన అఘాయిత్యాన్ని వివరించడంతో సీఐ నిందితుడ్ని అదుపులో తీసుకొని తాలుక సీఐ నల్లప్పకు అప్పజెప్పాడు. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు తాలుక సీఐ నల్లప్ప తెలిపారు.

మహానందిలో క్షుద్ర పూజల కలకలం

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మహానంది సమీపంలోని గరుడనందీశ్వరుని ఆలయానికి అత్యంత సమీపంలో క్షుద్రపూజలు జరిగినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. క్షుద్రపూజలు జరిగిన స్థలంలో స్త్రీ బట్టలు, నిమ్మకాయలు, పూజా వస్తువులు చూచి స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. క్షేత్రానికి అత్యంత సమీపంలో క్షుద్ర పూజలు జరగడంపై మహానందిలో శనివారం కలకలం రేగింది.

రిమాండ్ ఖైదీ మృతి

కర్నూలు క్రైం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ఓ కేసులో మూడో ముద్దాయిగా ఉన్న నెల్లూరు జిల్లా కావలికి చెందిన పోతురాజు పవన్‌కుమార్ కర్నూలు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందాడు. తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మించి విజయవాడ వైద్యుడిని మోసం చేసిన కేసులో పోతురాజు పవన్ కుమార్‌ను జూన్ 30వ తేదీన పోలీసులు అరెస్టు చేసి కర్నూలు సబ్ జైలుకు రిమాండ్‌కు పంపారు. అయితే కొంత కాలంగా అతడు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. శుక్రవారం కూడా కిడ్నీ సమస్య తలెత్తడంతో ఆసుపత్రిలో చేర్పించారు. శనివారం డయాలసిస్ కూడా చేశారు. అయితే అతడు కోలుకోలేక మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కుంటలోపడి వృద్ధురాలు..

దేవనకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పి.కోటకొండ గ్రామానికి చెందిన వృద్ధురాలు నీటికుంటలో పడి మృతిచెందింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెన్నమ్మ(80) రెండు రోజుల క్రితం నెల్లిబండ గ్రామంలోని మనవరాలిని చుసేందుకు కాలినడకన బయలుదేరింది. అయితే ఈదులదేవరబండ వద్ద నీరు తాగేందుకు వెళ్లి కుంటలో పడి మృతి చెందింది. గమనించిన స్థానికులు మృతదేహాన్ని బయటకు తీశారు. గతంలోనే భర్త, కుమార్తె మరణించడంతో ఒంటరిగానే ఉంటున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

మంత్రాలయం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవరం గ్రామానికి చెందిన బోయ అంజనేయ భార్య లక్ష్మి (30) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన శుక్రవారం జరిగింది. లక్ష్మీదేవి గత పదేళ్లుగా టీబీతో బాధపడుతుండేది. బళ్లారి, రాయచూరు, కల్లూరు, ఆదోని, ఎమ్మిగనూరు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్నా నయం కాలేదు. వ్యాధి తీవ్రం కావడంతో మనస్తాపానికి గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు చేరుకుని మృతదేహాన్ని ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మాధవరం ఎస్ఐ విజయకుమార్ తెలిపారు. మృతురాలికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

రైలు నుంచి పడి వృద్ధుడు..

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నంద్యాల-గిద్దలూరు రైల్వే ట్రాక్ పరిధిలోని బొగద టన్నెల్ వద్ద శనివారం 65 సంవత్సరాల వయస్సు గల వృద్ధుడు ప్రమాదవశాత్తు రైలు నుండి జారి పడి మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుని జేబులో నంద్యాల నుండి నరసరావు పేటకు రైల్వే టిక్కెట్టు ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో భారీ చోరీ

కొలిమిగుండ్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వటాల గ్రామంలో భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ భూలక్ష్మి, రామ్మోహన్ దంపతుల ఇంట్లో దుండగులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. రాత్రి భోజనం చేసిన తర్వాత తాళం వేసి ఇంటిపై నిద్రిస్తుండగా పక్కనే ఉన్న తాళం చెవిని దొంగలు తీసుకుపోయి చోరీకి పాల్పడ్డారు. బీరువాలో ఉంచిన 7 తులాల బంగారుతో పాటు రూ.1లక్షను ఎత్తుకెళ్లినట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కొలిమిగుండ్ల సీఐ రమేశ్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కర్నూలు నుంచి డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.



పరిశీలిస్తున్న డాగ్ స్క్వాడ్ సిబ్బంది

జంతువుల నుంచి ప్రాణాంతక వ్యాధులు

- అప్రమత్తం కావాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిక
- నేడు ప్రపంచ జూనోసిస్ డే



పశువును పరీక్షిస్తున్న వైద్యురాలు


కర్నూలు అగ్రికల్చర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మూగ జీవాలను సంరక్షించుకోవడం మన బాధ్యత. లేకుంటే వాటి వల్ల మనుషులకు వ్యాధులు సంక్రమిస్తాయని, అప్రమత్తంగా ఉండాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరిస్తోంది. భయంకరమైన రేబిస్‌వ్యాధి నివారణకు ఫ్రాన్స్ దేశానికి చెందిన లూయిస్‌పార్చర్ అనే శాస్త్రవేత్త టీకా మందును 1885 జూలై 6వ తేదీన కనుగొన్నాడు. దీన్ని పురస్కరించుకొని జంతువుల ఆరోగ్యాన్ని పరిరక్షించాలని, తద్వారా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే సందేశాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ చేపట్టింది. సాధారణంగా జంతువుల పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతను విస్మరిస్తే భయంకరమైన వ్యాధులు వాటికి సంక్రమించి తద్వారా మనుషులకు వ్యాపిస్తాయని పశుసంవర్ధకశాఖ జేడీ శ్రీనివాస్ తెలిపారు. సాధారణంగా జంతువులకు, వాటి ద్వారా మనుషులకు వైరస్, బ్యాక్టీరియా వల్ల వస్తాయని ఆయన చెబుతున్నారు. పశుపోషణ చేస్తున్న రైతులు పెంపుడు జంతువులైన కుక్కలు, పిల్లులు, ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, కోళ్లు, మొదలైన వాటిని పోషించేవారు జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రోటోజోవన్ జూనోసిస్..

అమీబియాస్, జియార్డియాసిస్, టాక్సాప్లాస్మోసిస్, బాలన్‌డియోసిస్, నల్లజ్వరం మొదలగునవి.

బ్యాక్టీరియల్ జూనోసిస్..


ఇది బ్యాక్టీరియా వలనే కలిగే వ్యాధులు. ముఖ్యంగా ఆంత్రాక్స్, బ్రూసెల్లోసిస్, క్షయ, ధనుర్వాతం, సాల్మోనెల్లోసిస్, లెప్టోస్పైరోసిస్ , కోలిబాసిలోసిస్ మొదలగునవి.



మనుషులకు సంక్రమించే వ్యాధులు

బ్రూసెల్లా అబార్టస్ లేక బ్రూసెల్లామిలిటిన్సిస్ అనే బ్యాక్టీరియా వలన బ్రూసెల్లోసిస్ అనే వ్యాపిస్తుంది. విదేశాల నుంచి వలస వచ్చే పక్షుల ద్వారా బర్డ్‌ఫ్లూ అనే వ్యాధి కోళ్లకు వ్యాపిస్తుంది. ఇది వైరస్ వలన సోకే వ్యాధి. పిచ్చికుక్కల ద్వారా భయంకరమైన రేబిస్ వ్యాప్తి చెందుతుంది. వైరస్ వలన రెండు నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లల్లో పందువల్ల మెదడువాపు వ్యాధి సంక్రమిస్తుంది. ఆంత్రాక్స్ (దొమ్మ వ్యాధి) అనే వ్యాధి బాసిల్లాస్, ఆంత్రాసిస్ అనే బ్యాక్టీరియా వల్ల కలుగుతుంది.

వైరల్ జూనోసిస్:



ఇది సూక్ష్మాతి సూక్ష్మక్రిమి ద్వారా వస్తుంది. ఉదాహరణకు పశువులలో మసూచి, మెదడువ్యాపు, పిచ్చి కుక్క కాటు, బర్డ్‌ఫ్లూ మొదలగునవి.

ఫంగల్ జూనోసిస్..

తామర, కాన్‌డియాసిస్.

పరాన్నజీవుల ద్వారా కలుగు జూనోసిస్..

ఎఖినోకోక్టోసిస్ , టీనియాసిస్, ఫైలేరియాసిస్, ఫేషియాథియోసిస్, సిస్టోసోమియాసిస్, హైడాటిడోసిస్, ట్రైకోస్టాంగైలోసిస్ మొదలగునవి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు:

పెంపుడు జంతువులకు జూనోసిస్ వ్యాధుల రాకుండా కర్నూలు నగరంలోని కొండారెడ్డి బురుజు వద్ద వ్యాధినిర్ధారణ ప్రయోగశాలలో వేస్తారు. వ్యాధి సోకిన పశు, పక్షాదులను మనుషులకు దూరంగా ఉంచాలి. మనుషులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

అప్రత్తమంగా ఉండాలి



జంతువుల నుంచి మనుషులకు వ్యాపించే వ్యాధులను వైద్యాధికారుల సూచనలు, సలహాలు పాటిస్తే వెంటనే నివారించుకోవచ్చు. జోనోసిస్ వ్యాధికి కర్నూలు నగరంలోని పాతబస్టాండు వద్ద ఉన్న పాలి క్లీనిక్ ప్రాంగణంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నాం. **- మల్లన్న, పశువైద్యాధికారి, నగర పాలక సంస్థ, కర్నూలు.**

కార్పొరేషన్‌లో అనారోగ్య జంతువులపై అప్రమత్తత

కర్నూలు నగర కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేశాం. నగరంలో నానాటికి పెరిగిపోతున్న వీధి కుక్కలను నివారించేందుకు చర్యలు తీసుకున్నాం. పలు కాలనీల్లో అనారోగ్యానికి గురైన గొర్రెలు, కోళ్ల మాంసాన్ని వినియోగదారులకు అందించకుండా చర్యలు తీసుకుంటున్నాం. **- శ్రీనివాస్, జేడీ**

నా మాట వినకుంటే తలలు తెగుతాయ్

- నేను చెప్పిన డీలర్‌కే బియ్యం ఎత్తించాలి..
- ఓ రెవెన్యూ అధికారికి టీడీపీ నాయకురాలి బెదిరింపులు

ఆదోని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నేను చెప్పిన డీలర్‌కే బియ్యం ఎత్తించాలి.. నా మాట కాదని వేరే వ్యక్తులకు ఇస్తే తలలు తెగుతాయని ఆదోని నియోజకవర్గానికి చెందిన ఓ టీడీపీ మహిళా నాయకురాలు ఓ మండల రెవెన్యూ అధికారిని బెదిరించారు. నాలుగు రోజుల క్రితం సదరు నాయకురాలు ఓ మండల రెవెన్యూ అధికారికి ఫోన్ చేశారు. కుప్పగల్లుకు ప్రజా పంపిణీ బియ్యం తాను చెప్పిన వ్యక్తికి ఎత్తించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే సంతకంతో కూడిన కూటమి నాయకులు ఇచ్చిన లెటర్ ప్యాడ్‌లో సదరు నాయకురాలు చెప్పిన వ్యక్తి పేరు లేదని, కాబట్టి అతనికి ఇవ్వలేనని ఆ రెవెన్యూ అధికారి తెగేసి చెప్పారు.

దీంతో కోపోద్రిక్తురాలైన సదరు టీడీపీ నాయకురాలు తన మాట వినకుంటే తలలు తెగుతాయని రెవెన్యూ అధికారిని బెదిరించారు. అయితే ఇలాంటి వాటికి తాను భయపడనని రెవెన్యూ అధికారి సమాధానం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారం పట్ల కూటమి నాయకులపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

మహిళపై వేధింపులు.. కేసు నమోదు

రుద్రవరం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రుద్రవరం గ్రామానికి చెందిన ఓ మహిళను అదనపు కట్నం కోసం, కులం పేరుతో దూషించినట్లు బాధిత మహిళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహ్మద్‌రఫి తెలిపారు. రుద్రవరం గ్రామానికి చెందిన యువతి, ఆళ్లగడ్డకు చెందిన యువకుడు ప్రేమించి, పెద్దల అంగీకారం లేకుండా కులాంతర వివాహం చేసుకున్నారు. తర్వాత భర్త, తల్లిదండ్రులు వేధింపులకు గురిచేసి కులం పేరుతో దూషించి అదనపు కట్నం తేవాలని వేధించడం మొదలు పెట్టారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల అ'పూర్వ' కలయిక



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నగర శివారు బి.తాండ్రపాడులోని పుల్లారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం సందడి సందడిగా సాగింది. సుమారు 30 ఏళ్ల అనంతరం కలుసుకున్న మొదటి బ్యాచ్ విద్యార్థుల మొదలు గత ఏడాది చదువు పూర్తిచేసుకున్న వారి వరకు సుమారు 500 మందికి పైగా విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఒకరినొకరు పరస్పరం ఆప్యాయంగా మాట్లాడుకుంటూ, అలనాటి తమ జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ఆనందోత్సాహాల మధ్య గడిపారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి దశలో తాము చేసిన అల్లరిని గుర్తు చేసుకొని మురిసిపోయారు. వీరి సంబరాలకు కళాశాల ప్రాంగణం వేదికైంది. ఈ కళాశాల్లో 1996 నుంచి 2024 వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు మధుసూదన్‌రెడ్డి, నాగరాజు, అనిల్, దీప్తి, కొడవలి శివరామకృష్ణ, సుధీర్, ఇస్మాయిల్, అనిల్, రఫీ, రవి ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. గతంలో కళాశాల్లో పనిచేసిన వారితోపాటు ప్రస్తుతం పని చేస్తున్న అధ్యాపకులు షరీఫ్, వై. సురేష్‌బాబు, ఓరుగంటి శ్రీధర్, వెంకటయ్య, భీమా నాయక్, జి. సురేష్‌లను శాలువ, పూలదండలతో ఘనంగా సత్కరించి వారి ఆశీస్సులు అందుకున్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రస్తుత ప్రిన్సిపల్ డాక్టర్ ఎంవీఎస్ఎస్ఎన్ ప్రసాద్, బయోమెడికల్ శాఖాధిపతులు రామాంజినేయులు, సుజాత, విశ్రాంత అధ్యాపకులు గోకారి, వేణుగోపాల్, ఎస్‌శ్రీన్ ప్రసాద్, గౌస్ సాహెబ్ పాల్గొన్నారు.

వ్యవసాయ కళాశాలలకు రూ.6.50 కోట్లు

- కొత్త వంగడాలు సృష్టించాలి
- విశ్వవిద్యాలయాన్ని అభివృద్ధి చేస్తాం
- ఎన్‌జీఆర్‌ఏయూ వీసీ శారదా జయలక్ష్మి



సావనీర్ విడుదల చేస్తున్న వీసీ

మహానంది, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ కళాశాలల అభివృద్ధికిగాను ఐసీఆర్ సంస్థ రూ.6.50 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ శారదా జయలక్ష్మి తెలిపారు. శనివారం రాత్రి వ్యవసాయ కళాశాల వార్షికోత్సం డీన్ వి.జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించారు. వీసీ శారదా జయలక్ష్మి హాజరయ్యారు. కళాశాల శాస్త్రవేత్తలు రూపొందించిన సావనీర్‌ను ఆవిష్కరించారు. క్రీడాపోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందచేసారు. అనంతరం మాట్లాడుతూ వ్యవసాయ విద్యలో జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామన్నారు. వరి వంగడాల్లో బిపిపిటీ-5204తో పాటు స్వర్ణ రకాలను న్యూఢిల్లీలోని జీనా హెడిటేజ్ సంస్థ సరికొత్త ప్రయోగాలు చేసి కీమికీటకాలు సోకకుండా సరికొత్త టెక్నాలజీతో తయారు చేసిందన్నారు. సీఎం చంద్రబాబు వ్యవసాయ కళాశాలలను సరికొత్త టెక్నాలజీతో మరింత ముందుకు తీసుకొని పోతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చరల్ ఆఫీసర్ చేరుకూరి శ్రీనివాసరావు, నంద్యాల ఆర్ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్, శాస్త్రవేత్తలు విజయ భాస్కర్, స్వరాజ్యలక్ష్మి, నారాయణరావు, మల్లేశ్వరరెడ్డి, త్రినాథరెడ్డి పాల్గొన్నారు.

ఇన్‌చార్జి లేకుండా ఎలా నిర్వహిస్తారు..?

- జిల్లా నాయకత్వంపై వీరభద్రగౌడ్ వర్గం ఆగ్రహం
- 'సుపరిపాలనలో తొలి అడుగు' సభను అడ్డుకోవడంతో ఉద్రిక్తత



జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డితో వీరభద్రగౌడ్ అనుచరుల వాగ్వాదం

కర్నూలు, జూన్ 5 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఇన్‌చార్జి లేకుండా సుపరిపాలనలో తొలి అడుగు సమావేశాలు ఎలా నిర్వహిస్తారు? కార్యకర్తలకు ఏమని సంకేతాలు ఇస్తున్నారు..? అంటూ ఆలూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్ వర్గం ఆగ్రహం చేశారు. శనివారం ఆలూరు నియోజకవర్గంలోని ఆస్పరి, ఆలూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలను ఆయన వర్గీయులు అడ్డుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో వీరభద్రగౌడ్ వర్గీయులను పోలీసులు బయటకు తోసేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి డౌన్.. డౌన్, టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ల కమిటీ గోబ్యాంక్ అంటూ నినాదాలు చేశారు. ఆలూరు ఇన్‌చార్జి బి.వీరభద్రగౌడ్, కార్యనిర్వాహక రాష్ట్ర కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ వర్గాలు మధ్య వర్గవిభేదాలు భగ్గుమంటున్నాయి. ఇరువర్గాలు సమన్వయంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహించాలని అధిష్ఠానం ఆదేశాలు జారీ చేసినా ఎవరిదారి వారిదే అన్నట్లు ముందుకు సాగుతున్నారు. ఈ నెల 2 నుంచి టీడీపీ అధిష్ఠానం సుపరి పాలనలో తొలి అడుగు పేరిట ఇంటింటికి వెళ్లి ఏడాదిలో చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు వివరించాలని టీడీపీ శ్రేణులకు నెల రోజుల ప్రణాళిక ఇచ్చింది. ఆలూరు టీడీపీలో ఇరు వర్గాలను సమన్వయం చేస్తూ పార్టీ కార్యక్రమాలను నిర్వహించేందుకు ఇన్‌చార్జి మంత్రి నిమ్మల, ఎంపీ బస్తిపాటి నాగరాజు, పరిశీలకుడు పూల నాగరాజును టీడీపీ ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్లుగా నియమించింది. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ఇక్కడ అడుగు కూడా పెట్టలేదు. శుక్రవారం ఎంపీ బస్తిపాటి నాగరాజు, పరిశీల కుడు పూల నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ లేకుండా దేవనకొండ, చిప్పగిరి మండలాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' సమావేశాలు నిర్వహించారు. ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ వర్గీయులకు మింగుడు పడలేదు. శనివారం కూడా ఆస్పరి, ఆలూరులో ఇన్‌చార్జి లేకుండానే సమావేశాలు నిర్వహించారు. ఎమ్మెల్సీ బీటీ నాయుడు, వాల్మీకి కార్పొరేషన్ చైర్మన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ హాజరయ్యారు. ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ వర్గీయులు ఆస్పరిలో టీఎన్ఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు సతీశ్, సీనియర్ నాయకుడు సంజప్ప ఆధ్వర్యంలో, ఆలూరులో టీడీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి నర్సప్ప, టీడీపీ మండల మాజీ కార్యదర్శి ముద్దు రంగయ్య, పట్టణ కార్యదర్శి మసాల జగన్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఇన్‌చార్జి లేకుండా ఎలా నిర్వహిస్తున్నారంటూ నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు వారిని బయటకు పంపించాక తొలి అడుగు సమా వేశాలు నిర్వహించారు. ఆలూరు సభలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి మాట్లాడుతూ అధిష్ఠానం ఆదేశాల మేరకు వీరభద్రగౌడ్‌ను ఇన్‌చార్జి బాధ్యతల నుంచి తొలగించామని, జోన్-5 ఇన్‌చార్జి బీద రవిచంద్రారెడ్డి ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లగా అలాంటిదేమీ లేదని పేర్కొనడం కొసమెరుపు.

పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టండి


కాల్వలో చెత్త సేకరణపై విచారిస్తున్న జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి

ఓర్వకల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనులు ముమ్మరంగా చేపట్టాలని జిల్లా పరిషత్ సీఈవో నాసరరెడ్డి తెలిపారు. శనివారం కాల్వ గ్రామంలో చెత్త సేకరణపై ఇంటింటికి తిరిగి విచారణ చేపట్టారు. చెత్తసేకరణ వాహనం ఇంటి వద్దకు వస్తున్నాయా లేదా అని ఆరాతీశారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని, ఎప్పటికప్పుడు డ్రైనేజీలు శుభ్రం చేసి నీటి నిల్వలు లేకుం డా చూడాలన్నారు. వాటర్ ట్యాంకులు శుభ్రపరచాలన్నారు. ఇంటింటికి చెత్తసేకరణ వాహనాలు ప్రతి ఇంటికి వెళ్లి చెత్త సేకరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామ నాయకులు ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోండి

ఓర్వకల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డా.శిరీష అన్నారు. శనివారం మండలంలోని హుశేనాపురం గ్రామ పీహెచ్‌సీ పరిధిలోని పూడిచెర్ల గ్రామంలో టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. డా.శిరీష మాట్లాడుతూ గ్రామాల్లో రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం, 60 ఏళ్లకు పైబడిన వారు, పొగ తాగేవారు, మద్యం సేవించే వారు, పౌష్టికాహారం లోపం ఉన్నవారికి అందరికీ టీబీ, గల్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శిలువ జ్యోతి, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, ల్యాబ్ సూపర్‌వైజర్ ఇమ్రాన్, హెల్త్ అసిస్టెంట్ రాజేంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ నీరజ, ఆరోగ్య కార్యకర్తలు లలిత పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల పరిశీలన


మీదివేములలో ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నవ్య

ఓర్వకల్లు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మీదివేముల గ్రామంలో ప్రభుత్వ భూములను శనివారం జాయింట్ కలెక్టర్ డా.బి. నవ్య, కర్నూలు ఆర్డీవో సందీప్ కుమార్ శనివారం పరిశీలించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు టెలి కాన్ఫరెన్స్‌లో రిలయన్స్ గ్రాఫ్ బయోసిజన్ భూములు కావాలని వీడియో కాన్ఫరెన్స్‌లో అధికా రులను ఆదేశించడంతో జేసీ డా.బి.నవ్య, ఆర్డీవో సందీప్ కుమార్ మీది వేముల గ్రామంలోని 170, 435, 168 సర్వే.నెంబర్లలో 187ఎకరాలు ఉందని, అయితే.. అదే ప్రాంతంలో రాక్ ఏరియా 200ఎకరాలు ఉందని తెలిపారు. ఈ నివేదికలను జిల్లా అధికారులకు పంపుతామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విద్యాసాగర్, అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలి

● విద్యుత్ కార్యాలయం ఎదుట సీపీఎం ధర్నా



కరెంటు ఆఫీసు ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లను ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ సీపీఎం అధ్వర్యంలో శనివారం బుధవారపేట బ్రిడ్జి వద్ద కరెంటు కార్యాలయం ఎదుట దర్నా నిర్వహించారు. గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్లు బిగించాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీచేయడం దారుణంగా ఉందన్నారు. జగన్‌కు, చంద్రబాబుకు పెద్ద తేడా లేదని విమర్శించారు. స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ వాడవాడలా ప్రచారం నిర్వహించి 14న ప్రజలను పెద్దఎత్తున సమీకరించి విద్యుత్ సౌధ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నగరకార్యదర్శి రాజశేఖర్, కార్యదర్శి వర్గసభ్యులు విజయ్, ఎస్ఎండి.షరీఫ్, కే.రామక్రిష్ణ, అబ్దుల్ దేశాయ్, నాగస్వాములు, మహబూబ్‌బాషా, ఆర్.కృష్ణ పాల్గొన్నారు.

హరిప్రియ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి

కర్నూలు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డలో చిన్నారి హరిప్రియ మృతికి కారణమైన స్కూల్ యాజమాన్యంపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆర్వీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చిన్నారి హరిప్రియ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కోరారు

కాలేజీ హాస్టల్‌లో తనిఖీ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరా గాంధీ నగర్‌లో ఉన్న ఎస్సీ కళాశాల బాలుర హాస్టల్‌లో జిల్లా ఫుడ్ సెక్రటరీ రాజగోపాల్ శనివారం తనిఖీలు చేశారు. 12 రకాల ఆహార పదార్థాల నమూనాలు సేకరించి నాణ్యత ప్రమాణాల సేకరణ కోసం రీజనల్ ల్యాబొరేటరీ గుంటూరుకు పంపించడం జరిగింది. ఈ పరీక్షల ఫలితాల అనంతరం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని అధికారులకు నవ్యాంధ్ర విద్యార్థి యువజన జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అయ్యస్వామి, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్, డెమోక్రటిక్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షులు శరత్ కుమార్ తెలిపారు. ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీలో మాజీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ప్రభుదాస్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



ఆర్‌యూలో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

కర్నూలు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లోఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77ను తక్షణమే రద్దు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. శరత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం రాయలసీమ యూనివర్సిటీ ముఖద్వారం ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ షాబీర్‌బాషా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.6,400కోట్ల ఫీజ్ రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నాయకులు ఆలీ, ప్రశాంత్, జగన్, కళ్యాణ్, నాయక్ పాల్గొన్నారు


తడకనపల్లె సుపరిపాలన తొలి అడుగులో ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి


గూడూరు మండలం గుడిపాడులో 'తొలి అడుగు'లో పాల్గొన్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

చంద్రబాబు పాలనలో రాష్ట్రం సుభిక్షం

'తొలి అడుగు'లో ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

కల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పేర్కొన్నారు. శనివారం తడకనపల్లె, నెరవాడ గ్రామాల్లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా నంద్యాల జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు కె.పార్వతమ్మతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. గౌరుచరిత మాట్లాడుతూ ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తూ వివరించారు. జగన్ అమరావతిని నాశనం చేయగా సీఎం చంద్రబాబు రూ.40 వేల కోట్లకు పైగా ఖర్చుచేసి అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలన్నీ నేరువేరుస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచు సహరాబీ, వేముల కోటి, దొడ్డిపాడు భాషా, జనసేన మండల నాయకుడు సలాం, నెరవాడ జాఫర్, కాతా మోహన్‌రెడ్డి, పెద్దపాడు లోకేశ్వరరెడ్డి, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ తదితరులు పాల్గొన్నారు.

● మొహర్రం వేడుకల్లో భాగంగా ఎమ్మెల్యే గౌరుచరిత తడకనపల్లె నెరవాడ గ్రామాల్లో శనివారం పెద్దస్వామి పీర్లకు ప్రత్యేక పూజలు చేశారు. మొహర్రం వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం గౌరుచరితకు సర్పంచు సహరాబీ, నెరవాడ జాఫర్, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు జుబేదాబీ, జనసేన మండల నాయకుడు సలాం శాలువాలతో సన్మానించారు.

● 34వ వార్డులో క్లస్టర్ ఇన్‌చార్జ్ పియూ.మాదన్న ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సమస్యలను తెలుసుకున్నారు. టీడీపీ యాప్‌లో వివరాలను నమోదు చేశారు. కార్యక్రమయంలో భాస్కర్‌గౌడ్, నారాయణగౌడ్, మహమ్మద్‌రఫీ, సులేమాన్ పాల్గొన్నారు.

● 41, 37 వార్డుల్లో క్లస్టర్ ఇన్‌చార్జ్ కె.జనార్దన్ ఆచారి ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కాసాని మహేష్‌గౌడ్, ఎస్. రాఘవేంద్ర, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

గూడూరు: రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. శనివారం గూడూరు మండలంలోని గుడిపాడు గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు జే.సురేష్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పరిశీలకుడు రామలింగారెడ్డి పాల్గొని ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను వివరించారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జే.సురేష్, సీనియర్ టీడీపీ నాయకులు మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

●రాష్ట్రంలో సుపరిపాలన చంద్రబాబుతోనే సాధ్యం అని పట్టణ అధ్యక్షుడు కే.రామాంజనేయులు అన్నారు. శనివారం పట్టణంలోని పడమర బీసీ కాలనీలో 175వ బూత్ ఇన్‌చార్జి చాంద్‌బాషా ఆధ్వర్యంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమ నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చాంద్‌బాషా, వెంకటేశ్ గౌడు, అక్కలదేవి గిడ్డయ్య, సులేమాన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: సుపరిపాలనతోనే సువర్ణపాలన రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్నారని టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి అన్నారు. శనివారం ఓర్వకల్లులోని సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి నాయకులు, కార్యకర్తలు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అన్ని విధాలా బాగుందని మహిళలు స్పష్టం చేశారన్నారు. కార్యక్రమంలో లక్ష్మీకాంతరెడ్డి, భాస్కర్ రెడ్డి, అల్లాబాబు, అబ్దుల్లా, శ్రీరాములు పాల్గొన్నారు.

సి. బెళగల్: పేదబడుగు బలహీన వర్గాల కోసమే టీడీపీ పార్టీ ఏర్పడిందని మండల కన్వీనర్ చంద్రశేఖర్ అన్నారు. శనివారం సి. బెళగల్ మండలంలో గుండ్రేవుల గ్రామంలో ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన పథకాల గురించి ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమర్, సయ్యద్‌బాబు, బాషా తదితరులు ఉన్నారు.

గూడెం కొట్టాల వాసులకు పట్టాలు ఇస్తాం: మంత్రి


మహిళలతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): గూడెం కొట్టాల వాసులకు ఇళ్ల పట్టాలు ఇస్తామని మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని అశోక్ నగర్ పంప్ హౌస్ ఎదురుగా ఉన్న గూడెం కొట్టాలను జాయింట్ కలెక్టర్ నవ్యతో కలిసి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మంత్రి నారా లోకేశ్ యువగళం పాదయాత్ర సమయంలో గూడెం కొట్టాల ప్రజలకు నివాసం ఉంటున్న చోటే పట్టాలు కావాలని అడిగారు. అప్పట్లోనే నారా లోకేశ్ స్పందించి తమ ప్రభుత్వం ఏర్పడ్డాక వీరికి పట్టాలు ఇస్తామని హమీ ఇచ్చారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో వీరికి పట్టాలు ఇచ్చే విషయంపై రెవెన్యూ శాఖ అధికారులతో చర్చించినట్లు మంత్రి తెలిపారు. మొత్తం 155 మందికి త్వరలోనే పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా వీరు కోరుకుంటున్న పట్టాలను ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్లలో ఇల్లులేని వారు ఉండకూడదనే లక్ష్యంతోనే తాము పని చేస్తున్నట్లు తెలిపారు.

సర్వజన వైద్యశాలను మరింత అభివృద్ధి చేస్తాం

కర్నూలు హాస్పిటల్: రాయలసీమ జిల్లాల ఆరోగ్య సంజీవిని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలను మరింతగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణంలో వైరాలజీ లేబరేటరీ నిర్మాణానికి మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే పార్థసారధి భూమి పూజ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కర్నూలు ఆసుపత్రి, మెడికల్ కాలేజీ అతి పురాతనమైనమని, ఎంతో ప్రాముఖ్యత ఉన్నదని, ఈ బోధనాసుపత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి పరిచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.కార్యక్రమంలో వీఆర్‌డీఎల్ అధికారి వైస్ ప్రిన్సిపాల్ డా.రేణుకాదేవి, ఏపీ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా.డి.శ్రీహరిరావు, ఆదోని శాసనసభ్యులు డా.పార్థసారధి, కాలేజీ ప్రిన్సిపల్ డా.కేచిట్టినరసమ్మ, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపల్ డా.సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డా.డి.శ్రీరాములు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

లలితాపీఠంలో వారాహి దేవి హోమం


వారాహి దేవి హోమం నిర్వహిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పాతనగరంలో జమ్మిచెట్టు సమీపంలోని లలితాపీఠంలో శనివారం వారాహిదేవి అమ్మవారి హోమం నిర్వహించారు. లోక కల్యాణార్థం రాష్ట్రంలో సుభిక్షంగా వర్షాలు కురిసి పసిడి పంటలు పండాలని కోరుకుంటూ ఈ హోమము నిర్వహించారు. కాగా గత తొమ్మిది రోజులుగా కొనసాగిన వారాహి దేవి అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరిగాయని, నిత్యం రెండు వేలకు పైగా భక్తులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారని లలితా పీఠం పీఠాధిపతి గురు మేడా సుబ్రహ్మణ్యం స్వామి తెలిపారు. కాగా శనివారం మహిళా భక్తులు సమూహిక కుంకుమార్చన, సువాసినీ పూజ, కన్యకా పూజలు, లలితా సహస్రనామ పారాయణం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ప్రసాదం పంపిణీ చేశారు.

దోమకాటుతో ప్రాణాంతక వ్యాధులు


మహిళలకు దోమతెరలు, మస్కిటో కాయిల్స్‌ను పంపిణీ చేస్తున్న డా.శంకర్‌శర్మ

కర్నూలు హాస్పిటల్, జూలై 5 (ఆంధ్ర జ్యోతి): ప్రాణాంతక వ్యాధులను కలగజేసే దోమ కాటుకు గురి కాకుండా ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి. శంకర్‌శర్మ సూచించారు. నగరంలోని గాయత్రీ ఎస్టేట్‌లో ఉన్న శ్రీగురు దత్తపాలి క్లినిక్‌లో శనివారం ఆయన పేదలకు దోమతెరలు, మస్కిటో కాయిల్స్‌లను పంపిణీ చేశారు.

వర్షాకాలంలో దోమ కాటుకు గురి కావద్దు

కర్నూలు హాస్పిటల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో దోమ కాటుకు గురి కాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు జేవీఈఎం యూనిట్ సీనియర్ ఎంటామాలజిస్టు సి.చంద్రశేఖర్‌రావు అన్నారు. ఈ మేరకు జిల్లా మలేరియా కార్యాలయంలో సీనియర్ ఎంటమాలజిస్టుగా పదోన్నతి పొందిన చంద్రశేఖర్‌రావును జిల్లా ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అభినందించింది. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరాములు, మద్దూరి వెంకటస్వామి, జీసీ రాముడు, వెంకటన్న, సుధకర్, సుభాషిణి శేఖర్ పాల్గొన్నారు.

9న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్లను రద్దు చేయాలని, 8 గంటల పనివిధానాన్ని కొనసాగించాలని కోరుతూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప పిలుపునిచ్చారు. శనివారం ఏఐటీయూసీ కార్యాలయంలో నగర అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షతన నగర కౌన్సిల్ సమవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మునెప్ప మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగట్టడానికే దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నారన్నారు. 7న ఉదయం సి.క్యాంపు నుంచి పాతబస్టాండు వరకు బైక్ ర్యాలీ ఉంటుందని 10 గంటలకు ఉద్యోగ,కార్మికసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. ఈ సమవేశంలో నగర కార్యదర్శి జి.చంద్రశేఖర్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈశ్వర్, నగర కార్యదర్శి కృష్ణారెడ్డి, డిప్యూటి కార్యదర్శి రామాంజనేయులు, రమీజాబి, తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు అగ్రికల్చర్: 9న దేశ వ్యాప్తంగా జరుగుతున్న సమ్మెలో వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న అన్ని కార్మిక సంఘాలు పాల్గొంటున్నాయనీ ఈ సమ్మెను అనుమతి ఇవ్వాలని కోరుతూ శనివారం సీఐటీయూ నాయకులు కర్నూలు మార్కెట్ కమిటీ సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మికి సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ యార్డు యూనియన్ గౌరవాధ్యక్షుడు రాముడు, సీఐటీయూ నగర కార్యదర్శి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప

సాయిబాబ, లారీ హమాలీ యూనియన్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కోత హమాలీ యూనియన్ నాయకులు వెంకటేశ్వర్లు, పూలపట్టుబడి హమాలీ యూనియన్ నాయకులు మద్దిలేటి, మిన్నెల్ల పాల్గొన్నారు.

కోడుమూరు: లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి జీపీ వీరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీసీ కార్యాలయం ముందు శనివారం నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ రద్దు కోరుతూ 9న సమ్మె చేస్తున్నామని చెప్పారు. అనంతరం ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ స్వామిదాసుకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు సుజాత, చంద్రమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి


ఇండస్ పాఠశాలలో విద్యార్థుల ప్రతిజ్ఞ

కర్నూలు ఎడ్యుకేషన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని అర్థ ధర్మ ఫైనాన్సియల్ లిటరసీ ఫౌండేషన్ ప్రతినిధి కే.మోహన్ అన్నారు. శనివారం అర్థ ధర్మ ఫైనాన్సియల్ లిటరసీ ఫౌండేషన్, అధితి మిల్లెట్స్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం పిల్లల ఆరోగ్యకరమైన అలవాట్లను పెంచుకునేందుకు కర్నూలులోని ఇండస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కే.మోహన్ మాట్లాడుతూ పిల్లలు రోజూ తీసుకునే బిస్కట్లు, జంక్‌ఫుడ్ వంటి ప్యాకెట్ల ఆహారాల్లో ఉండే షుగర్ పరిమాణాన్ని తెలుసుకోవడం, చైతన్యభరితమైన యాక్టివిటీ ద్వారా విషయాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు అవసరమైన చక్కెర మోతాదులో పిల్లలు అధిక మోతాదులో తీసుకుంటున్నారని ఆయన తెలిపారు. దీనివల్ల మధుమేహం, ఊబకాయం, వంటి ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయని హెచ్చరించారు.

పీర్లకు ప్రత్యేక పూజలు


గుట్టపాడులో స్వాముల వారికి పూజలు చేస్తున్న టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి

ఓర్వకల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుట్టపాడు గ్రామంలో శనివారం పీర్లచావిడిలలో ఏర్పాటు చేసిన పీర్లకు టీడీపీ మండల కన్వీనర్ గోవిందరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని ఓర్వకల్లు, కొంతలపాడు, హుశేనాపురం, కాల్వ, శకునాల తదితర గ్రామాల్లో పీర్లకు ప్రత్యేక పూజలు చేసి వీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఇస్లామియా, మహమ్మద్, నబీరసూల్ పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఆర్టీసీ ఈయూ ధర్నా

కర్నూలు రూరల్ జూలై 5(ఆంధ్రజ్యోతి): కర్నూలు1,2డిపో ఎదుట ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నా శనివారం రెండో రోజు కూడా కొనసాగింది. ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు ఎర్రబ్యాడ్జీలు ధరించి ఆందోళన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ఈయూ రాష్ట్ర కార్యదర్శి మద్దిలేటి, కర్నూలు జిల్లా జాయింట్ సెక్రటరి కృష్ణార్జున రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏపీఎస్ఆర్టీసీలో డ్రైవర్లు, కండక్టర్లు,మెకానిక్ రిక్రూట్‌మెంట్‌ను వెంటనే జరపాలని డిమాండ్ చేశారు. డిపోల వద్ద నెట్‌వర్క్ స్థాయిని 5జీకి పెంచాలని 11వ పీఆర్సీ బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు మధ్యంతర భృతి ప్రకటించి కొత్తబస్సులను కొనుగోలు చేయాలని కోరారు. ధర్నాలో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు చంద్ర, ఆర్‌వీఎం రావు, జీవీరెడ్డి, మహేశ్వరరావు, రామకృష్ణ, రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

● నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నంద్యాల జిల్లా వైసీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం నగర శివారులోని హ్యాంగవుట్ ఫంక్షన్‌హాల్లో నంద్యాల పార్లమెంట్ పరిశీలకులు, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి ఆధ్వర్యంలో ఆయన బాబు ష్యూరిటీ..మోసం గ్యారెంటీ పాణ్యం నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు జిల్లా వైసీపీ అధ్యక్షుడు ఎస్వీ.మోహన్‌రెడ్డి, నరగ మేయర్ బీవై. రామయ్య పాల్గొన్నారు. కాటసాని మాట్లాడుతూ ఏడాది అయినా సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయలేదని ఆరోపించారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల సబ్సిడీ జమ కావడం లేదని, తల్లికి వందనం పడని కుటుంబాలు చాలా ఉన్నాయని, రైతులకు అన్నదాత సుఖీభవ ఊసే లేదని, బీసీలకు 50 ఏళ్లకే పింఛన్, 18 సంవత్సరాలు దాటిన మహిళలకు నెలకు రూ.1500, ఉచిత బస్సు అమలు కాలేదని విమర్శించారు. రాష్ట్రంలోని నిరుద్యోగులకు భృతి, సూపర్‌సిక్స్ పథకాలతో పాటు కూటమి ప్రభుత్వ ఏడాది పాలన వైఫల్యాలను ప్రజలకు ఇంటింటికీ తిరిగి వివరించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

కర్నూలు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మునెప్ప డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు శనివారం కర్నూలు రూరల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తక్షణమే సీఎం చంద్రబాబునాయుడు పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నాగరాజు, గిడ్డమ్మ, ఈశ్వర్, కిట్టు, చంటి, రవి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు

ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

సి. బెళగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఎరువులను అధికధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని విజిలెన్స్ సీఐ పవన్‌కుమార్ ఫర్టిలైజర్ ఎరువుల దుకాణం డీలర్లను హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాసిరకం విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. రైతులు విత్తనాలు తీసుకునే సమయంలో రసీదు తప్పని సరిగా తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట విజిలెన్సు అధికారులు విశ్వనాథ్, ఏవో మల్లేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నేడు ఆకాశవాణిలో అజీజ్ నాటకం 'దేవసేన'

కర్నూలు కల్చరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన ప్రముఖ నవలా రచయిత, రాష్ట్ర కందుకూరి పురస్కార గ్రహీత ఎస్‌డీవీ అజీజ్ రాసిన రేడియో నాటకం 'దేవసేన' ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారం అవుతుందని సినీ నటుడు సుబ్బరాయ శర్మ తెలిపారు. ఆకాశవాణి హైదరాబాదు కేంద్రం ద్వారా ఈ నాటకం ప్రసారం అవుతుందని, ఇందుకు సంబంధించిన రికార్డింగ్ కార్యక్రమాలు శనివారం ఆకాశవాణి హైదరాబాదు కేంద్రంలోని రికార్డింగ్ థియేటర్‌లో పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రముఖ నటుడు డాక్టర్ సాంబశివరావు కంద్రాతి నిర్వహణలో ప్రసారం కానున్న ఈ నాటకంలో సినీ నటుడు సుబ్బరాయశర్మ, శిల్ప, డాక్టర్ సాంబశివరావు, కేఆర్ ఫణిరాజ్, ఆర్ ఉమాదేవి, కేవీఎల్ నరసింహారావు, జీవన ఆదిత్య, డి. పరమేశ్వరాచారి వివిధ పాత్రలకు గాత్రదానం చేశారని తెలిపారు.

వినియోగదారులపై బండ



పత్తికొండ పట్టణంలో గ్యాస్ డెలివరీ ఆటో

● గ్యాస్ సిలిండర్ డెలివరీకి అదనపు వసూళ్లు
● రసీదు రూ.908లు, వసూలు చేసేది రూ.970, గ్రామాల్లో రూ.1,000

పత్తికొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ మీద అదనంగా వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గృహ వినియోగం కోసం వినియోగించి గ్యాస్ సిలిండర్లపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీతో సిలిండర్లను సరఫరా చేస్తోంది. పత్తికొండ పరిధిలో 16,493 మంది గ్యాస్ కనెక్షన్లు ఉండగా, 14,950 మంది వినియోగదారులు యాక్టివ్‌మోడ్‌లో ఉన్నారు. ఏజెన్సీ నిర్వాహకులు ఆటోల ద్వారా పట్టణంతోపాటు గ్రామీణప్రాంతాలకు సిలిండర్లను సరఫరా చేస్తుంటారు.

డెలివరీ చార్జీల పేరుతో..

నిర్వాహకులు మాత్రం డెలివరీ ఛార్జీల పేరుతో వినియోగదారులపై అదనపు భారం మోపుతున్నారు. గ్యాస్ బుక్ చేసుకున్న వినియోగదారులకు ఇంటివద్దకు సిలిండర్ ఇచ్చినందుకు ఒక్కో సిలిండర్‌పై రూ.70 వరకు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. గతంలో రూ.20ల నుంచి రూ. 30 వరకు వసూలు చేస్తుండగా, అది ప్రస్తుతం రూ.70 వరకు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తికొండ పట్టణంలో సిలిండర్ ధర రూ.908 కాగా రూ.970 వరకు వసూలు చేస్తున్నారు. ఇక ఏకంగా రూ.1,000 తీసుకుంటున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ఈ దందా విషయం అధికారు లకు తెలిసినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నట్లు వినియోగదారులు ఆరోపిస్తున్నారు.

రూ.970లు తీసుకున్నారు



గ్యాస్ సిలిండర్ బుక్ చేసుకోగా డెలివరీకి రూ.970 లు తీసుకున్నారు. రసీదులో రూ.908లు మాత్రమే ఉంది. అదేమని అడిగితే డీజిల్ రేట్లు పెరిగాయి, డెలివరీ ఛార్జీలను కూడా పెంచామంటున్నారు. **- ఖాసిం, పత్తికొండ**

ఫిర్యాదు చేస్తే చర్యలు

గ్యాస్ వినియోగదారుల నుంచి డెలివరీ చార్జీలు వసూలు చేయరాదు. అలా వసూలు చేసినట్లు గ్యాస్ వినియోగదారులు లిఖితపూ ర్వకంగా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం. **- హుసేన్ సాహెబ్, తహసీల్దార్, పత్తికొండ**

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తులు

పత్తికొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ నయిమున్నీ సాబేగం పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ కోర్సులకు సంబంధించి జువాలజీ, మెకానికల్ అండ్ ఆటో మొబైల్స్ టెక్నిషియన్స్ సబ్జెక్టుల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఎమ్మెస్సీ జువాలజీ, బిటెక్ మెకానికల్ అండ్‌ఆటోమొబైల్ ఇంజనీరింగ్‌లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు వారు దరఖాస్తుచేసుకోవాలన్నారు. వివరాలకు 8309916198 మొబైల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్కూల్ బస్సులను తనిఖీ చేయాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని ప్రైవేటు, కార్పొరేట్ స్కూలు, కళాశాల బస్సులను తనిఖీ చేయాలని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పీఎస్‌ఏ, డీఎస్‌ఎఫ్, ఎస్ఎస్ఏ విద్యార్థి సంఘ నాయకులు ఎంవీఐ శశిర దీప్తికి వినతి పత్రం అందజేశారు. రాజు, శివప్రసాద్, ఉదయ్ మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థల బస్సులు చాలావాటికి ఫిట్‌నెస్ లేదని, పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకొని గ్రామాల నుంచి తీసుకొస్తున్నారన్నారు. అనుభవం లేని డ్రైవర్లతో నడుపుతున్నారని, బస్సులో అటెండర్లు కూడా ఉండరన్నారు. వినోద్, మురళి నవీన్ పాల్గొన్నారు.



ఎంవీఐకి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

'సూర్యఘర్'ను సద్వినియోగం చేసుకోండి

● విద్యుత్ ఎస్ఈ ఉమాపతి



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఈ

దేవనకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ ఎస్ఈ ఉమాపతి సూచించారు. శనివారం దేవనకొండలో ఇంటింటికి వెళ్లి వినియోగదారులకు వివరించారు. 1 కె.వి.కీ రూ.60వేల ఖర్చు వస్తుందని, ప్రభుత్వ సబ్సిడీ రూ.30 వేలు, బ్యాంకు రుణం రూ.30వేలు మంజూరు చేస్తుం దన్నారు. వినియోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. వినియోగదారులు క్యూఆర్ కోడ్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఏఈ రవీంద్ర, లైన్‌ఇన్‌స్పెక్టర్ యంకప్ప, లైన్‌మెన్ సుంకన్న, పోల్‌టూపోల్ శ్రీనివాసులు ఉన్నారు.

'అన్నదాత సుఖీభవ' జాబితా సిద్ధం



మాట్లాడుతున్న ఏవో రవి

మద్దికెర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించిన అన్నదాత సుఖీభవ రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు ఏవో రవి తెలిపారు. శనివారం కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలో 7,300 మంది రైతులుంగా, 6,600 మంది సుఖీ భవకు అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. మరో 600 మంది డీ-పట్టా భూములు, మిగులు భూములు, చుక్కల భూ ములు, ప్రభుత్వ భూములు ఉన్నాయని వారికి వర్తించదన్నారు. అభ్యంత రాలున్న రైతులు వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సుపరిపాలనే ప్రభుత్వ ధ్యేయం



పెండేకల్ ఆర్ఎస్‌లో కరపత్రాలు ఇస్తున్న నాయకులు

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరిస్తూ, ప్రజలకు సుపరిపాలన అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయ మని టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, మాజీ సర్పంచ్ మసాల శ్రీను, చాంద్‌బాషా అన్నారు. శనివారం పెండేకల్ ఆర్ఎస్‌లో సుపరిపాలన తొలి అడుగు నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకు న్నారు. మాజీ సర్పంచ్ బర్మా వీరేష్, క్లస్టర్ ఇన్‌చార్జి శ్రీనివాసగౌడు, సొసైటీ డైరెక్టర్ రాంపల్లి శ్రీను, మహ్మద్ రఫీ, నారాయణ, మహేష్‌గౌడు, ఖైరాముడు, రజాక్, నల్లగుండ్ల రవి, ఓలప్ప, రాము తదితరులు ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న సీఐటీయూ కార్యదర్శి గోపాల్

పత్తికొండటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9వ తేదీన తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ కార్యదర్శి గోపాల్ పిలుపునిచ్చారు. శనివారం ఈశ్వర్‌రెడ్డి భవన్‌లో మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురా వడంతో కార్మికులకు తీరని నష్టం వచిచందని రద్దు చేయాలని ఆందోళనలు చేసినా మార్పు లేదన్నారు. వెంకటేశ్వర్‌రెడ్డి, దస్తగిరి, రవిచంద్ర, ప్రజాసంఘాల నాయకులు రమేష్, ప్రభాకర్, కాశీం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో చిచ్చు పెట్టకండి

వెల్దుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో వైసీపీ నాయకులు చిచ్చు పెట్టవద్దని మాజీ ఎంపీపీ జ్ఞానేశ్వర్‌గౌడ్ సూచించారు. శనివారం మాట్లాడుతూ టీడీపీ బడుగు, బలహీన, దళితుల పార్టీ అని అన్నారు. మన ఇంట్లోనే అభిప్రాయ బేధాలుంటాయని అలాంటిది పార్టీలో ఉండవా? అని మా పార్టీలో మీ జోక్యమేంటని వైసీపీ నాయకులను ప్రశ్నించారు. వైసీపీ హయాంలో చేసిన నిధుల దుర్వినియోగంపై జిల్లా ఉన్నతాధికారులు ఆడిట్ నిర్వహించాలని కోరారు. వీరభద్రుడు, ఐజయ్య, మల్లికార్జున, అనకలకిట్టు, పరమేశ్, ఆనందు, హరి, నాగసూరి పాల్గొన్నారు.

పనిచేసే కార్యకర్తలను పార్టీ మరచిపోదు

● ఎంపీ నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి

ఆస్పరి/ఆలూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం పనిచేసే కార్యకర్తలను టీడీపీ ఎన్నటికీ మర్చిపోదని తప్పక గుర్తింపు ఇస్తుందని ఎంపీ బస్తిపాటి నాగరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పరిశీలకుడు పూల నాగరాజు అన్నారు. శనివారం ఆస్పరిలో మండల కన్వీనర్ పరమారెడ్డి అధ్యక్షతన కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. తిక్కారెడ్డి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఆదేశానుసారం పనియాలని, ఏడాది పాలనను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఇంటికి తిరిగి అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి పెట్టారని ఆలూరు, పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, మం త్రాలయం నియోజకవర్గాలు అభివృద్ధి చెందుతాయన్నారు. ఈనెల 11న నిర్వహించ నున్న గ్రామ కమిటీల్లో సమస్యల ను విన్నవించుకోవాలని సూచించారు. వాల్మీకి ఫెడరేషన్ చైర్‌పర్సన్ కప్పట్రాళ్ల బొజ్జమ్మ, మాజీ జడ్పీటీసీ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీలు కృష్ణయాదవ్, వెంకటేష్, రామచంద్రనాయుడు, వెంకటేష్ చౌదరి, జీవన్‌కుమార్, మధుసూదన్‌చౌదరి పాల్గొన్నారు.

● ఆలూరు పట్టణంలోని వాసవీ కళ్యాణ మండపంలో శనివారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్సీ బి.టి.నాయుడు మాటాంలడెతే త్వరలో జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని అన్నారు.

అర్హులందరికీ ఇంటి స్థలాలు

● గ్రామాల్లో మూడు, అర్బన్‌లో రెండు సెంట్ల చొప్పున..
● సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్



మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్

ఆదోని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ ఇంటి స్థలం ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పేర్కొన్నారు. శనివారం కార్యాలయంలో ఆదోని డివిజన్‌లోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్థలం కావాలని ఇప్పటివరకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో సమాచారం సిద్ధం చేసుకోవాలని, గ్రామాల్లో 3, పట్టణాల్లో 2 సెంట్ల చొప్పున పట్టా ఇవ్వాలని ఆదేశించారు.

స్మార్ట్ మీటర్లను ధ్వంసం చేస్తాం

● సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య



పత్తికొండలో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పత్తికొండటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్మార్ట్ మీటర్లు బిగించాలని చూస్తే వాటిని ధ్వంసం చేస్తామని సీపీఐ కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య హెచ్చరించారు. శనివారం స్థానిక సీఆర్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించి నాలుగు స్తంభాలకూడలికి చేరుకున్నారు. వైసీపీ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే పగులగొట్టాలని చెప్పిన చంద్రబాబు, లోకేశ్ అధికారంలోకి వచ్చాక చేస్తున్నది ఏంటని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలను పెంచబోమని చెప్పి అధికారంలోకి రాగానే చార్జీలను పెంచడం చంద్రబాబుకే చెల్లిందన్నారు. గత ప్రభుత్వంలో స్మార్ట్ మీటర్లు పగలగొట్టిన సీపీఐ నాయకులపై కేసులు నమోదయ్యారని కోర్టు వాయిదాలకు తిరుగుతున్న విషయాన్ని గుర్తు చేశారు. రాజాసాహెబ్, రామాంజనేయులు, సురేంద్రకుమార్, గురుదాస్, కారుమంచి, వీరన్న, తిమ్మయ్య, రంగన్న, సిద్ధు, చాకలి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లను వెనక్కి తీసుకోవాలి

దేవనకొండ: విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రభుత్వం వెనక్కి తీసుకొవాలని సీపీఐ నాయకులు మద్దిలేటిశెట్టి, నర్సారావ్ డిమాండ్ చేశారు. శనివారం దేవనకొండ టర్నింగ్ వద్ద కర్నూలు-బళ్లారి రహదా రిపై రాస్తారోకో నిర్వహించారు. అధికారంలోకి రాకముందు కరెంట్ బిల్లులపై ఆందోళన చేసిన టీడీపీ నాయకులు ప్రభుత్వం రాగానే సర్దుబాటు పేరుతో పేదల నడ్డి విరిచిందని, ఇప్పుడు స్మార్ట్‌మీటర్లు ఏర్పాటు చేయడం ఏంటని విరమించుకొవాలని కోరారు. కండప్ప, కృష్ణ, రవి, రామాంజినేయులు, బాస్కర్, తదితరులు పాల్గొన్నారు

కర్ణాటక మద్యం స్వాధీనం



మద్యంతో ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి

ఆదోని, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నూతన వతెన వద్ద కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కర్నూలు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుభాషిణి తెలిపారు. వివరాల మేరకు.. కర్ణాటక నుంచి ఆదోనికి కారులో తరిస్తున్న 14 కేసుల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆదోని చందన మల్లికార్జున, హరిశ్చంద్రను అరెస్టు చేసి వారి కారును సీజ్ చేశారు. వీరిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

విద్యాకమిటీ చైర్మన్ మృతి



రామాంజినేయులు (ఫైల్)

పత్తికొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలరలోని దూదెకొండ గ్రామంలో విద్యాకమిటీ చైర్మన్ కోరం రామాంజి నేయులు (35) శనివారం మృతిచెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు.. మొహర్రం వేడుకల్లో ఉండగా గుండె పోటుకు గురయ్యాడు. పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించయగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. భార్య లక్ష్మితోపాటు అంజి, మానస, పరమేష్ సంతానం.

టీబీ నిర్మూలనకు చొరవ చూపాలి

ఆదోని టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): టీబీ బాధితులను దత్తత తీసుకొని వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ చొరవ చూపాలని మున్సిపల్ కౌన్సిలర్ నాగరత్న, మొంబత్తి స్వామి అన్నారు. శనివారం షరాఫ్ బజార్‌లో టీబీ బాధితులకు పోషక ఆహార కిట్లను పంపిణీ చేశారు. మెడికల్ ఆఫీసర్, డా అనిల్ సాగర్, సూపర్వైజర్‌లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మ బాయి, చంద్రశేఖర్, కృష్ణవేణి పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి చెరువుకట్ట వద్ద పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. సమాచారం మేరకు శనివారం దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని, రూ.5,320లు స్వాధీనం చేసుకున్నామ న్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపుతామన్నారు.

జాతీయ రహదారిని పూర్తి చేయాలి



చంద్రశేఖర్ రెడ్డి

ఆదోని టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక, ఆంధ్ర రాష్ట్రాలను కలిపే ఎన్‌హెచ్ 157ని పూర్తిచేయాలని మాజీ ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మాట్లాడుతూ కర్ణాటకలోని బళ్లారి జిల్లా నుంచి మన రాష్ట్రంలోని చింతకుంట, మీదుగా ఆలూరు, ఆదోని, మంత్రాలయం వరకు రహదారి ఉందన్నారు. అయితే చింతకుంట సమీపంలో మూడు వంతెనల పనులు గత 3 సంవత్సరాలుగా ఆగిపోయా యన్నారు. కర్ణాటక, మహారాష్ట్ర నుంచి నిత్యం వచ్చే భారీ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు చోటుచేసుకున్నాయన్నారు. అధికారులు, పాలకులు పట్టించుకోకపో వడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై కేంద్ర మంత్రి గడ్కరీ లేఖ రాశానన్నారు.

ఇన్‌చార్జి ఎంపీడీవోగా జనార్దన్

ఆదోని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఇన్‌చార్జి ఎంపీడీవోగా జనార్ధన్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన విజయశేఖర్ ఎమ్మెల్యే పీఏగా బదిలీ కావడంతో డిప్యూటీ ఎంపీడీవో జనార్ధన్‌ను ఇన్‌చార్జిగా నియమిస్తూ ఉన్నతాధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెచ్చగొట్టేలా మాట్లాడకండి

వెల్దుర్తి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలను రెచ్చగొట్టేలా మాట్లాడటం తగదని టీడీపీ నాయకుడు సుబ్బరాయుడు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాల యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ ంలో కార్యకర్తలు తాగునీటి సమస్య విషయం తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. పదిరోజులకోసారి నీరు వదులుతున్నారని సమాచారం ఉందని, ప్రజలను ఇబ్బంది పెడితే సొంతపార్టీ వారినైనా ఉపేక్షించమని హెచ్చరించామన్నారు. వైసీపీ నాయకులు తమ మాటలను వక్రీకరించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మాజీ డిప్యూటీ సీఎం కేఈ హయాంలో రూ.3.15 కోట్లతో క్రిష్ణగిరి రిజర్వాయర్ నుంచి వెల్దుర్తికి నీటిని తరలిచేందుకు నిధులు మంజూరుచేశామన్నారు. రూ.50 లక్షలతో సీసీ రోడ్లు వేశామన్నారు.

సొసైటీలతో రైతుల అభివృద్ధి



సొసైటీ జెండాను ఆవిష్కరిస్తున్న సీఈవో

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీలతో రైతులు అభివృద్ధి చెందుతారని సీఈవో మనోహర్ నాయుడు అన్నారు. మండలంలోని పెండేకల్ ఆర్ఎస్ మారెళ్ల అశోకా సొసైటీలో శనివారం 103వ అంతర్జా తీయ సహకార దినోత్సవం నిర్వహించారు. సొసైటీ జెండాను ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా సహకార సొసైటీల అభివృద్ధికి కేంద్ర మంత్రి అమిత్‌షా కృషి చేస్తున్నార న్నారు. అందులో భాగంగానే రైతులు ఎదురు చూస్తున్న దీర్ఘకాలిక రుణాలు (ఎల్‌టీ లోన్లు) ఇస్తామని, అర్హులైన రైతులందరూ దరఖాస్తు చేసుకోవాలన్నారు. సిబ్బంది చాంద్‌పీరా, మదుసూదన్ నాయుడు, షాషా, కాశీం, సతీష్ పాల్గొన్నారు.

మమ అనిపించారు

● అరగంటలో ముగిసిన మండల సమావేశం



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారులు

ఆదోని రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశాన్ని అరగం టలోనే ముగించడంతో ప్రజలు విస్తుపో తున్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ బడాయి దానమ్మ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం నిర్వహిం చారు. ఉదయం 10గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా, మధ్యాహ్నం 12 గంటలన అనంతరం ఎంపీడీవో విజయ శేఖర్ సమావేశాన్ని ప్రారంభిం చారు. ఎంఈవో, వైద్యా. దికారి, రెవెన్యూ అధికారులు గైర్హాజర య్యారు. వ్యవసాయాధికారి సుధాకర్, ఏపీవో క్రిష్ణమూర్తి మాట్లాడిన అనతరం సమావేశాన్ని ముగించారు.

విద్యావ్యాపారాన్ని అరికట్టాలి



నిరసన తెలుపుతున్న ఆర్ఏవీఎఫ్ నాయకులు

ఆదోని అగ్రికల్చర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యా వ్యాపారాన్ని అరిక ట్టాలని అభ్యుదయ విద్యాలయ ఫెడరేషన్ అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ట్స్ కళాశాల రహదారిలో విద్యార్థులతో కలిసి ఆందోళ చేపట్టారు. అనుమతి లేకుం డా కొన్ని ప్రైవేటు, కార్పొట్ విద్యాసంస్థల్లో హాస్టళ్లు నడుపుతూ రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25 శాతం ఉచిత సీట్లు కేటాయించాల్సి ఉండగా అమలు కాలేదని, అలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాజా, రాజన్న, నాగేంద్ర, మోమన్, అల్లా ప్రకాష్, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

రైతుల సమస్యలపై దృష్టి పెట్టండి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సింగిల్ విండో చైర్మన్ ఆనంద్

మద్దికెర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సహకార సంఘం పరిధిలో రైతుల సమస్యలపై దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే శ్యాంబాబు సూచిం చారు. ఎడవలి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఆనంద్ మద్దికెర సహకార సంఘం చైర్మన్‌గా నియామకమ వడంతో శనివారం ఎమ్మెల్యేను కలి శారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు రుణాల కోసం ఇబ్బంది పడకుండా ఉండేందుకు నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. ఆకుల వేణుగోపాల్, రంగస్వామి, పంచాయతీ సలహాదారులు నంది జయరాముడు, తదితరులు ఉన్నారు.

నిరంతర పోరాటం

మద్దికెర, జూలై 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి నబీ రసూల్ అన్నారు. శనివారం సీపీఐ కార్యదర్శి నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం రైతులందరికీ వర్తింపజేయాలన్నారు. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు ఇప్పించాలని, ఫాంపండ్స్ ఉపాధి నిధులతో నిర్మించాలని కోరారు. ఈ నెల 12న సీపీఐ మహాసభలు 14వ సభలు ఉంటాయన్నారు. మదనంతపురం హను మన్న, కోదండరాముడు తదితరులు ఉన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి

తుగ్గలి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): సర్దుబాటు పేరుతో పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఐ నాయకులు నబీరసూల్, సుల్తాన్ డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో సీని యర్ అసిస్టెంట్ సుధాకర్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఎన్నికల ముందు చార్జీలు పెంచమని చెప్పి, సర్దుబాటు పేరుతో రూ.15,485 కోట్లను మోపిందన్నారు.



డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

సమస్యలు పరిష్కరించాలి

ఆదోని అగ్రికల్చర్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ ఉద్యోగులు సమస్యలను పరిష్కరించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు రంగస్వామి, డిపో అధ్యక్షుడు లక్ష్మన్న డిమాండ్ చేశారు. శనివారం డిపో వద్ద డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు ఆందోళన చేశారు ఆగస్టు 15 నుంచి అమలవుతున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణానికి ప్రభుత్వం నూతన బస్సులను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత ఉన్న ఉద్యోగులు సరిపోరని పదివేల మందిని నియమించాలన్నారు. కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు, సీసీఎస్ కమిటీ సభ్యుడు చాంద్ బాషా, రమణమూర్తి, సుధాకర్, మెసేయ్య రాజు, బాబు ప్రసాద్ రామాంజి నేయులు, తిరుపతయ్య, వాసు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు

● ఎమ్మిగనూరు ● మంత్రాలయం

సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలి



సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పెద్దకడబూరు , జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు సద్వినియోగం చేసుకోవాలని గంగులపాడు పాఠశాలలో టీడీపీ నాయకులు బాబురావు, గోపాల్‌లు కోరారు. శనివారం విద్యాకమిటీ చైర్మన్ రంజాన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సర్వేపల్లి రాదకృష్ణ విద్యాకిట్లు అందజేశారు. ఈ సందర్భంగా టీడీపి నాయకులు బాబురావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాభివృద్ధికి పెద్దపీట వేశారన్నారు. ఇచ్చిన హమీ మేరకు ఇంట్లో ఎంతమంది విద్యార్థులు ఉంటే అంతమందికి తల్లికి వందనం వేసి పేద విద్యార్థులను ఆదుకున్నారన్నారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటరాముడు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారించుకోవాలన్నారు. కార్యక్రమంలో సోమన్న, శివ, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి



వైఎస్సార్ సర్కిల్‌లో ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఎమ్మిగనూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మిగనూరు పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్‌లో ధర్నా కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల 11న కలెక్టరేట్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళనల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. జిల్లా సమితి సభ్యులు మునిస్వామి, విష్ణు, రవి, సురేష్, వీరేష్, రాకేష్ పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : సర్వ శిక్ష అభియాన్ కార్మికులను రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం కొరకు, జూలై 9న చేపట్టే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు తాలూకా కార్యదర్శి రాముడు, ఎస్ ఎస్ ఎ కార్మిక సంఘం జిల్లా కమిటి సభ్యులు రంగన్న గౌడ్ పిలుపునిచ్చారు.అనంతరం దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను విడుదల చేశారు .ఈ కార్యక్రమంలో నాగరాజు, విజయ్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు

గోనెగండ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో గ్రామంలో అంటువ్యాధులు ప్రభల కుండా చర్యలు తీసుకుంటున్నామని మేజర్ సర్పంచ్ హైమావతి, పంచాయతీ కార్యద ర్శి సతీష్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మలాంగ్ అన్నారు. శనివారం వారు మాట్లాడుతూ అందులో భాగంగా గోనెగండ్లలో నాలుగు రోజులుగా పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపడుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో వాధ్యులు ప్రభల కుండా ఉండేందుకు గాను ముందుజాగ్రత్త చర్యలో బాగంగా మురికి కాలువలను శుభ్రం చేయడం, అందులోని చెత్తను గ్రామ శివార్లకు తరలించడం, బ్లీచింగ్ పౌడర్ వీధుల్లో, మురికి కాలువల్లో చల్లడం ద్వారా దోమలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. గ్రామంలో తాగునీటి సమస్య లేకుండా చేస్తున్నామని, గ్రామంలో ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

సప్త రాత్రోత్సవాల ఏర్పాట్ల పరిశీలన



సీఐ రామాంజులతో కలిసి ఏర్పాట్లు పరిశీలిస్తున్న పీఠాధిపతి

మంత్రాలయం, జూలై 5 (ఆంధ్రజ్యోతి):మంత్రాలయం 354వ సప్తరాత్రోత్సవాల ఏర్పాట్లను పీఠాధిపతి సుబుదేంద్రతీర్థులు అధికారులతో కలిసి పరిశీలించారు. శనివారం ఏఏవో మాధవశెట్టి, మఠం మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషీ, శ్రీపతాచార్, సురేష్ కోనాపూర్, ఐపీ నరసింహమూర్తి, బద్రినాథ్, మంత్రాలయం సీఐ రామాంజులుతో కలిసి ఏర్పాట్లను పరిశీలించారు. వచ్చే నెల 8 నుంచి 14 వరకు జరిగే ఉత్సవాలకు లక్షలాది మంది భక్తులు తరలివస్తున్న దృష్ట్యా తాగునీరు, క్యూలైన్లు, శుభ్రత, వసతి, ట్రాఫిక్, పార్కింగ్ వంటి అంశాలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ అనంతపురాణిక్, జేపీ స్వామి, ద్వారపాలక అనంతస్వామి పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ప్రసాద్

ఎమ్మిగనూరు రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏఐటియూసి తాలుకా అధ్యక్షులు వీరేష్, కార్యదర్శి తిమ్మగురుడు అధ్యక్షతన కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటుచేశారు ఈ నె 9న కేంద్ర, కార్మిక సంఘాలు తల పెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను అన్ని కార్మిక సంఘాలు జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి విజేంద్ర, యల్లప్ప, మల్లికార్జున గౌడ్, నరసింహలు, శివ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆకస్మిక తనిఖీ

నందవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నందవరంతో పాటు, కనకవీడు గ్రామాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను శనివారం డిప్యూటీ డిఎం అండ్ హెచ్‌వో సత్యవతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామాల్లో ఏఎన్ఏలు, ఆశా వర్కర్లు ఇంటింటికి తిరిగి అప్రమత్తం చేయాలన్నారు. క్యాంపులకు వెళ్లేటప్పుడు హాజరు పట్టికలో రాసి వెళ్లాలన్నారు. అలా చేయకపోతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

గుక్కెడు నీటికి తప్పని తిప్పలు

- వారం రోజులకు ఒకసారి తాగునీటి సరఫరా
- 40 సంవత్సరాల క్రితం నిర్మించిన ఓహెచ్ఆర్‌తో సమస్య
- పైపులైన్ ఏర్పాటుపై అధికారుల తర్జనభర్జన



40 ఏళ్ల క్రితం నిర్మించిన ట్యాంకు

కౌతాళం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందాగా తయారయింది మండల కేంద్రమైన కౌతాళంలో తాగునీటి సమస్య. ప్రస్తుతం గ్రామ జనాభా దాదాపు 20 వేలు, ఓటర్లు 11వేలు ఉంది. ఇంత జనాభాకు తాగు నీరు అందించడంలో మండల అధికారులు, ప్రతినిధులు విఫలమౌతున్నారు. 40 సంవత్సరాల క్రితం 6వేల జనాభాను దృష్టిలో ఉంచుకుని 1988లో జనాభాకు సరిపడా 2లక్షల లీటర్ల కెపాసిటీ గల ఓహెచ్ఆర్ ట్యాంకును నిర్మించారు. ప్రస్తుతం గ్రామ జనాభా సుమారు 20వేలు పైగా ఉండటంతో ఈ జనాభాకు ఈ ట్యాంకు ద్వారానే తాగునీటి సరఫరా చేస్తున్నారు. తాగునీటి సరఫరాలో వారం రోజులకు కూడా ఆయా కాలనీలకు తాగునీరు అందడం లేదు. కామవరం రస్తాలో పది సంవత్సరాల క్రితం 40వేల లీటర్లతో మరో ఓహెచ్ఆర్‌ను అధికారులు నిర్మించినా కనీసం వారం రోజులకు ఒకసారి కూడా తాగునీరు అందని కాలనీలు ప్రస్తుతం ఉన్నాయి. దీంతో గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఒకసారి సరఫరా చేస్తే మరో వారం పది రోజుల వరకు వేచి చూడాల్సి వస్తుందని గ్రామ ప్రజలు తెలిపారు.తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు రాజానగర్ వద్ద ఎస్ఎస్ ట్యాంకును నిర్మించి అక్కడ నుంచి ఈఓహెచ్ఆర్‌లకు నీటిని సరఫరా చేస్తున్నారు. ఎస్ఎస్ ట్యాంకు నుంచి సరఫరా చేసేందుకు 10హెచ్‌పీ మోటర్లు నిర్మించినా వాటి ద్వార పంపింగ్ చేసే సమయంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడితే ఈ ఓహెచ్ఆర్‌లు నింపేందుకు విద్యుత్ వస్తే కనీసం తిరిగి 40నిమిషాల సమయం తరువాత ఓహెచ్ఆర్‌కు నీరు చేరుతుంది. ఇలా కాకుండా గ్రామానికి ప్రత్యేక మోటరు ఏర్పాటు చేయాలని చాలసార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేదని గ్రామ ప్రజలు వాపోతున్నారు. నీటి సరఫరాలో అపుడపుడు పైపులైన్ లీకేజి, పైపులు పగిలితే మరో వారం రోజుల వరకు తాగునీరు రావడం లేదని ప్రజలు అంటున్నారు. వారం రోజులకు సరిపడా నీటిని నిల్వ చేసుకునేందుకు ప్రతి ఇంట్లో రెండు నుంచి 10 డ్రమ్ములను కొంటున్నారు. ఈ వారం రోజుల నిల్వ నీటి వల్ల నీళ్లలో పురుగులు పడుతుండటంతో వాటినే తాగాల్సిన పరిస్థితులు లేకపోలేదు. వాటిని తాగడం వల్ల వ్యాధుల భారిన సందర్భాలు అనేకం ఉన్నాయి. గ్రామంలో రోజు విడిచి రోజు తాగునీటి సరఫరా కొనసాగిస్తే తప్ప గ్రామంలో తాగునీటి సమస్య తీరదు.



ద్విచక్రవాహనంలో నీటిని తీసుకెళ్తున్న దివ్యాంగుడు

ఎనిమిది రోజులుగా తాగునీరు సరఫరా లేదు

మా కాలనీకి తాగునీరు సరఫరా చేసి నేటికీ ఎనిమిది రోజులు అవుతోంది. ఇంట్లో తాగేందుకు, పనులు చేసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. చేసేదేమిలేక బండ్ల ద్వారా నీటిని తీసుకువస్తున్నా. అధికారులు స్పందించి తమ కాలనీకి కనీసం రెండు రోజులకు ఒకసారి నీటి సరఫరా చేస్తే బాగుం టుంది. తాము పడుతున్న ఇబ్బందులు అధికారులు గుర్తించి తాగునీటి సమస్య లేకుండా చూడాలని కోరుతున్నాం.

● షేక్షావలి, వైఎస్ఆర్ నగర్, కౌతాళం

వారం రోజుల్లో సమస్య పరిష్కారం

గ్రామంలో చాలా ఏళ్లుగా ఈ సమస్య ఉంది. ప్రజల సమస్యలను గుర్తించి గ్రామంలో ఎస్ఎస్ ట్యాంకు నుంచి రూ.5లక్షలతో ప్రత్యేక పైపులైన్ ఏర్పాటు చేసి వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం. రెండు రోజుల్లో ప్రత్యేక పైపులైన్ పనులు ప్రారంభిస్తాం. ఇప్పటికే మోటార్లు, పైపులు వచ్చాయి. గ్రామంలో మూడు రోజులకు ఒకసారి సరఫరా చేస్తాము.

● నాగ మల్లయ్య, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, కౌతాళం

రహదారి నిర్మించాలి



ఎమ్మిగనూరు- కోసిగి ప్రధాన రహదారిపై వరినాట్లు వేస్తున్న సీపీఐ(ఎంఎల్) నాయకులు

పెద్దకడబూరు , జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు- కోసిగి వేళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా ఉందని వెంటనే నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) జిల్లా నాయకులు సత్యన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల పరిధిలోని గోల్లలదోడ్డి గ్రామ సమీపంలో ఎమ్మిగనూరు- కోసిగి ప్రధాన రహదారి గుంతలమయింగా మారడంతో సీపీఐ(ఎంఎల్) నాయకులు, గ్రామస్తులు, వాహనాదారులతో కలిసి వరినాట్లు వేసి వినూత్నంగా నిరసన కార్యక్రమం చేపట్టారు. పభుత్వం, ఉన్నాతాధికారులు రోడ్డుపై దృష్టి సారించి వెంటనే నూతన రహదారి నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాలరాజు, బాబు, ఆంజినేయులు, ప్రసాద్, నరసన్న, రామాంజి, బుడ్డన్న, గ్రామస్థులు, పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పెంపునకు ప్రతిపాదనలు

మంత్రాలయం, జూలై 5(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో అదనంగా 35 పోలింగ్ కేంద్రాలు పెంపుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తాహసీల్దార్ రమాదేవి, ఎన్నికల డిప్యూటి తాహసీల్దార్ జీకే గురురాజరావులు తెలిపారు. శనివారం మండలంలోని రచ్చుమర్రి గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లతంలో 237 పోలింగ్ కేంద్రాలు ఉండగా 1200 కంటే ఓటర్లు ఎక్కువగా ఉన్న కేంద్రాలను రెండుగా విభజన 35 కేంద్రాలను చేసేందుకు జిల్లా ఉన్నతఅధికారులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతామని తెలిపారు. స్పెషల్ డిప్యూటి కలెక్టర్ అనురాధ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

యూరియా కొరత లేకుండా చూస్తాం: ఎమ్మెల్యే



యూరియా పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి

ఎమ్మిగనూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రైతులకు యూరియా కొరతలేకుండా తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయం దగ్గర ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు సబ్సిడీ ధరలపై యూరియాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ ఖాద్రీ, ఏఓ శివశంకర్, డీసీఎంఎస్ ప్రతినిధి సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కురువ మల్లయ్య, ఫెర్టిలైజర్స్ అసోషియేషన్ అధ్యక్షులు మహేంద్ర బాబు, టీడీపీ పట్టణ అధ్యక్షులు మహేష్ పాల్గొన్నారు.

ఏపీ హంస తాలుకా అధ్యక్షుడిగా నాగన్న గౌడ్

ఎమ్మిగనూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఏపీ హంస అసోషియేషన్ తాలుక అధ్యక్షులుగా నాగన్న గౌడ్‌ను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం పట్టణంలోని శిల్పా కాలనీలోని అర్బన్ హెల్త్‌సెంటర్‌లో అసోసియేషన్ సమావేశాన్ని జిల్లా అధ్యక్షులు రఘు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన అధ్యక్షుడు జగదీష్‌ను సభ్యులు సన్మానించారు. అలాగే అసోసియేషన్ ట్రెజరర్ పోస్టుకు శిరాజున్నీసా బేగంను ఎన్నుకున్నారు. సమావేశంలో సంఘం నాయకులు సయ్యద్ షఫీ, సందీప్, త్యాగరాజు, ఆదోని నాయకులు బాబురాజు, శ్రీరాములు, ఆలూరు నాయకులు ఉమాపతి, చంద్రమోహన్, ఎమ్మిగనూరు నాయకులు రఫీక్ అలి, భలరామయ్యలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సాధించేందుకు కృషి



ఎన్నికైన నూతన కమిటీ నాయకులను సన్మానించిన దృశ్యం

ఎమ్మిగనూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత, దళితుల ఆశాజ్యోతి డా బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని జైభీం ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు ముత్తు సుమాల ఆధ్వర్యంలో ఎమ్మినూరు పట్టణ అధ్యక్షుడిగా మద్రి గుంటెప్ప, ప్రధాన కార్యదర్శిగా కదిరికోట రాజు, పట్టణ ఇన్‌చార్జీగా సందీప్, పట్టణ మహిళా అధ్యక్షురాలిగా కదిరికోట పద్మక్కలను ఎన్నుకున్నారు.

సీఎం చంద్రబాబు విజనరీ లీడర్: మంత్రి



కోల్‌మానుపేటలో మంత్రి భరత్‌కు, రాఘవేంద్రరెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న తెలుగు తమ్ముళ్లు



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే బీవీ

కోసిగి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే విజన్ ఉన్న నాయకుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అగ్రస్థానంలో ఉన్నారని, రాష్ట్రాన్ని తన విజన్‌తోనే ముందుకు నడిపిస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం కోసిగి మండల పరిధిలోని కోల్‌మానుపేట గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డితో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కోసిగిలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని మంత్రి పూజలు చేశారు. ముందుగా కోసిగి ఆర్యవైశ్యులు మంత్రి టీజీ భరత్‌ను, మంత్రాలయం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డిని పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి టీజీ ఫౌండేషన్ ద్వారా రూ.5 లక్షలు విరాళం అందిస్తున్నటు మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

నందవరం, జూలై 5(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబుతోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన నందవరంలో సుపరిపాలనలో తొలి అడుగులో బాగంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న దీపం పథకం, తల్లికి వందనం, పింఛన్ పథకాలు ప్రజలకు అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రాని వారెవరైన ఉంటే చెప్పాలని లబ్దిదారులను అడిగారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉద్యోగ అవకాశాలు, అన్నదాత సుఖీభవ పథకాలు ప్రవేశపెట్టి సీఎం ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఆయన మాట్లాడుతూ గ్రామంకు జలజీవన్ పథకం కింద రూ కోటికి పైగానే నిధులు మంజురైతే వాటి ద్వారా ఇంటింటికి కోళాయిలు వేసి ప్రజల దాహర్తిని తీర్చామన్నారు. ఈశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి కార్యకర్తలతో సమావేశమైయ్యారు. అనంతరం నందవరం సహకార సంఘం సొసైటీలో సహకార సంఘం మండల అధ్యక్షుడు దర్మాపురం గోపాల్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బీవీ రైతులకు ఎరువులతో పాటు యూరియాను అందజేశారు. జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారన్నారు. రైతులను పట్టించుకోలేదన్నారు. కార్యక్రమంలో అబ్జర్వర్ శ్రీరాములు, క్లస్టర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దేశాయ్‌మాధవరావు, మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి, మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లయ్య, నాగరాజుగౌడు, మండలపార్టీ కన్వీనర్ కాశీంవలీ, దర్మాపురం గోపాల్, ఈషా, తిమ్మారాజు, మస్తాన్, చిన్నరాముడు, వడ్డే గోపాల్, సత్యారెడ్డి, సుదీర్, లచ్చప్ప, వెంకటేశ్వరరెడ్డి, రహిమాన్, నదీకైరవాడి వీరేష్, పీఆర్ ఏఈ నరసింహులు, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, ఏపీఎం రాఘవేంద్ర, ఏపీవో శ్రీనివాసులు, ఏవో సరిత పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని బూదూరు గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ లక్ష్మయ్య, జిల్లా అధికార ప్రతినిధి చావిడి వెంకటేశ్, వరదరాజులు, కంసాలి నరసింహ, సింగిల్ విండో డైరెక్టర్లు డిసీ తిమ్మప్ప, చాపల నగేష్, లక్ష్మన్న, ఎస్‌పీ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నాగరాజు, అబ్రహం, మోశే, రోగెప్ప, భూషణం, దాసు, శాంతిరాజు, కాంతప్ప, రాముడు, జయన్న, ఎల్లెల్సీ కాలువ చంద్ర పాల్గొన్నారు.

అండగా ఉంటాం : మంత్రాలయం మండలంలోని చెట్నహళ్ళి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు పద్మశాలి దేవగట్టు ఈరన్న(68) అనారోగ్యంతో శనివారం తెల్లవారు జామున మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి మృతదేహనికి నివాళులు అర్పించారు.

గోనెగండ్ల, టీడీపీ పాలనలోనే సుపరిపాలన సాధ్యం అని ఒంటెడుదిన్నె టీడీపీ నాయకడు రమేష్‌ఆచారి అన్నారు. శనివారం ఆయన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే మండల కేంద్రమైన గోనెగండ్లలో కూడా పట్టణ అధ్యక్షుడు హోటల్ రహంతుల్లా కూడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది కాలంలో అభివృద్ది పనులు ఏమి జరిగాయి. ఇంకా ఎమి జరుగుతాయో ప్రజలకు వివరించారు. టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఏకాదశి పూజలు బంద్

మంత్రాలయం, జూలై 5(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఆదివారం ఏకాదశి సందర్భంగా బృందావనానికి నిత్యం జరిగే అభిషేకాలు, అలంకరణ, నిత్య అన్నదానం, రథోత్సవాలు ఊరేగింపు, పరిమళ ప్రసాదం, టెంకాయ కొట్టడం బంద్ చేస్తారు. పీఠాధిపతులు సుబుధేంద్ర తీర్థుల ఆశీస్సులతో కేవలం బృందావనానికి నిర్మల విసర్జనం అలంకరణ లేని రాఘవేంద్రస్వామి నిజ బృందావనానికి భక్తులు దర్శించుకొనే అవకాశం మాత్రమే శ్రీ మఠం అధికారులు కల్పించనున్నారు. పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు, పండితులు, అర్చకులు, శ్రీమఠం ఉద్యోగులు ఉపవాసం పాటిస్తారు.

ధార్మిక పర్యటనకు పీఠాధిపతి: పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం బెంగళూరుకు బయలుదేరి వెళ్లారు. ఉదయం నుంచి పూజలు ముగించుకొని తన శిష్య బృందంతో ధార్మిక పర్యటనకు వెళ్లారు. పర్యటన ముగించుకొని మంగళవారం మంత్రాలయంకు చేరుకుంటారని మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్ ఎస్‌కే శ్రీనివాసరావు,వెంకటేష్ జోషి తెలిపారు.

స్మార్ట్ మీటర్లను తొలగించాలి

పెద్దకడబూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ మోటార్లకు ఉన్న స్మార్ట్ మీటరు తొలగించాలని సీపీఐ మండల కార్యదర్శి వీరేష్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఆంజనేయులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని సీపీఐ నాయకుల ఆధ్వర్యంలో విద్యుత్ సబ్ స్టేషన్ ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు కార్యక్రమంలో సీపీఐ నాయకులు కుమ్మరి చంద్ర, తిక్కన్న, ఏఐవైఎఫ్ నాయకులు జాఫర్ పటేల్, షేక్షావలి, హనుమంతు, కడబూరప్ప, నాగన్న పాల్గొన్నారు.

నందవరం: విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడు, జిల్లా సమితి సభ్యుడు సోమేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నందవరం బస్టాండ్‌లో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటు నిరసన, ధర్నా కార్యక్రమం నిర్వహించారు. వ్యాపారస్తులు, చిన్న ఉద్యోగుల మీద భారం పడకుండా పెంచిన చార్జీలు రద్దు చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో గిడ్డయ్య, ఉరుకుందుగౌడు, రమేష్, తిప్పన్న, రామలింగడు, ముని, వీరేష్, హుసేన్, దేవరాజ్ పాల్గొన్నారు.

మంత్రాలయం: రాష్ట్ర వ్యాప్తంగా పెంచిన విద్యుత్ చార్జీలు వెంటనే తగ్గించాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి భాస్కర్ యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేసి అక్కడి సిబ్బందికి వినతి పత్రం అందజేశారు. ప్రజలపై భారం పడకుండా స్మార్ట్ మీటర్లు రైతుల పొలాలకు, ఇళ్లకు బిగించడం విరమించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్, గాబ్రియేలు, ఈరన్న, పెద్ద మస్తాన్, దేవవరం, రామలింగ, లక్ష్మి, సాలమ్మ, రామాంజనేయులు ఉన్నారు.

టీడీపీకి రాజీనామా చేసిన మాజీ కౌన్సిలర్లు

ఎమ్మిగనూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని 29వ వార్డు టీడీపీకి చెందిన మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మధుబాబు, 3వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ లక్ష్మిదేవి, టీడీపీ పట్టణ ప్రధానకార్యదర్శి చేనేత మల్లికార్జునలు పార్టీకి రాజీనామాచేశారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని గీతానగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మధుబాబు మాట్లాడుతూ పదేళ్లుగా టీడీపీలో పనిచేస్తూ, 2014-19లో కౌన్సిలర్‌గా పోటీచేసి గెలుపొందామని, 2021లో తనే భార్యను మున్సిపల్ కౌన్సిలర్‌గా పోటీచేయించి ఆర్థికంగా నష్టపోయామన్నారు. అలాగే 2024 ఎన్నికల్లో శక్తి వంచన లేకుండా టీడీపీ గెలుపుకు, ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి గెలుపుకు కష్టపడి గెలుపించుకున్నామన్నారు. అయితే గెలిచిన తరువాత ఏడాది కాలంగా తమని ఏ కార్యక్రమాలకు, సమావేశాలకు పిలువటం లేదు, ఇటీవల పార్టీ సంస్థాగత కమిటీల సమయంలో కూడ మాకు ఎలాంటి సమాచారం లేకుండా వేరేవారిని ఎంపిక చేశారు. పార్టీ మహానాడుకు కూడా పిలువలేదు. ఏడాదికాలంగా ఇలా తమల్ని అవమానాలకు గురిచేస్తూ వస్తున్నారని తెలిపారు. ఎమ్మిగనూరు టీడీపీలో ఇప్పటికే ఒక కౌన్సిలర్ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరగా, నందవరం మండలానికి చెందిన ఓ ప్రధాననాయకుడు పార్టీకి రాజీనామా చేశారు.

ఆవిర్భావ సభను జయప్రదం చేయండి



డీఈఎఫ్ ఆవిర్భావ పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : కర్నూలులో జూలై 22వ తేదిన జరగబోయే దివ్యాంగుల సాధికారత ఫోరం ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని డీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నాగరాజు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం స్థానిక డిఈఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో డీఈఎఫ్ గౌరవ అధ్యక్షులు అల్ఫ్రెడ్ రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీలా జోగిబాబులు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు కాపాడుకోవడానికై ఏర్పడిన సంస్థ ఆవిర్భావ సభను కర్నూలులో జూలై 22న నిర్వహించబోతున్నామన్నారు. .అనంతరం ఆవిర్భావ సభ పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఈరన్న, వెంకటేష్ పాల్గొన్నారు.